


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి : 05 సంచిక : 121 పేజీలు : 8

గురువారం 09-10-2025 వెల : 5/-

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పతంగ్ పార్టీ వ్యూహం

-పోటీ చేస్తుందా? లేదా? అన్నది అనుమానం

2లో

## నేడే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్



**-నోటిఫికేషన్ విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు మార్గం సుగమం అయింది. నోటిఫికేషన్ విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారం నేడు యథావిధిగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. నేడు నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. నేడు ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్‌లు స్వీకరించనున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం

మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో

# హైవోల్టేజ్

- రోజంతా ఇరు వర్గాలు వాడివేడిగా వాదనలు
- బీసీ రిజర్వేషన్ల జీవోపై విచారణ నేటికి వాయిదా
- రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమన్న పిటిషనర్
- సమగ్ర అధ్యయనం తర్వాతే బిల్లు తీసుకువచ్చామన్న ప్రభుత్వం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ నేటికి వాయిదా పడింది. నేడు మధ్యాహ్నం రెండున్నరకు తదుపరి విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది. బుధవారం అటు పిటిషనర్ల తరపు లాయర్లు, ఇటు ప్రభుత్వం తరపు లాయర్లు తమ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. వాదనలు కొనసాగుతున్న సమయంలో గురువారం మరిన్ని వాదనలు వినిపిస్తామని ప్రభుత్వం తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో పిటిషనర్ల తరపు లాయర్లు, గురువారమే నోటిఫికేషన్ ఇస్తారని హైకోర్టు నిర్ణయం వచ్చే వరకూ నోటిఫికేషన్ జారీ చేయకుండా చూడాలని కోరారు. అయితే హైకోర్టు ఈ అంశాన్ని పట్టించుకోలేదు. నోటిఫికేషన్ జారీ చేయకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నోటిఫికేషన్ రానుంది. అంటే రేపటి నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు.






## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి

-దేశాన్ని బలోపేతం చేయాలని మోదీ పిలుపు



## సమసిన "దున్నపోతు" వ్యాఖ్య వివాదం

2లో

- అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ

## పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- సుమారు 67 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు
- ప్రాజెక్టుల వేగవంతమైన అమలుకు ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం



మిగతా 2లో



## కోర్టుల్లో జడ్జిలకు అర్థమయ్యేదాకా పోరాటం చేస్తాం

-గ్రూప్-1 విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న కవిత

## బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం

-ఆరుగురు సజీవ దహనం, సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రభుత్వానికి చెక్ పడుతుంది

-ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు దిశానిర్దేశనం



## ఇండిగోపై భారీ జరిమానా

-20 లక్షల జరిమానా విధించిన



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
గురువారం 09 అక్టోబర్2025

# బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో హైవోల్టేజ్

బీసీ రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయని ప్రభుత్వం తరపు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. జీవోపై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందన్నారు. ఏక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా 42 శాతానికి బీసీ రిజర్వేషన్ల పెంపు జరిగిందని. 97 శాతం ఇంటింటి సర్వే జరిగింది, బిల్లును గవర్నర్ ఇప్పటివరకు ఆమోదించలేదు, తిరస్కరించలేదని అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. రిజర్వేషన్లు యాభై శాతం మించకూడదనేది సుప్రీంకోర్టు సూచనేనని.. చట్టం కాదన్నారు.

**పిటిషనర్ల తరపు వాదనలు ఇవీ**

ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనా, రిజర్వేషన్లు 50 శాతం మించితే ఎన్నికలు రద్దవుతాయని సుప్రీంకోర్టు నిబంధన ఉందని పిటిషనర్ తరపు లాయర్ ప్రస్తావించారు. ట్రిపుల్‌టెస్ట్ లేకుండా రిజర్వేషన్లు పెంపు సాధ్యం కాదని 2021లో సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలను గుర్తు చేశారు. ట్రిపుల్ టెస్టు లేకుండా రిజర్వేషన్లు పెంచొద్దని సుప్రీం ఇచ్చిన మార్గదర్శకాలను కోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలంటే ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలి రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. కేవలం షెడ్యూల్ మాత్రమే విడుదల చేశారని వివరణ 4 అంశాల ఆధారంగా జీవో 9 ఛాలెంజ్ చేస్తున్నామన్నారు. వన్‌మ్యాన్ కమిషన్ నివేదిక బయటపెట్టలేదు ట్రిపుల్ టెస్టు లేకుండానే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్నారు. అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లు ఎప్పుడు పాసైందని చీఫ్ జస్టిస్ వాదనల సమయంలో అడిగారు. ఆగస్ట్ 31 రెండు సభల్లో పాసైందని గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉందని తెలిపారు. చట్టంగా ఇంకా మారలేదన్నారు.

# స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి

ముంబై (ప్రశ్న న్యూస్) దేశ ప్రజలు 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం (ఎన్ఎంఐఏ) మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకం వల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. "ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలి. ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలి. ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుంది. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయి" అని ప్రధాని మోదీ వివరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశ భద్రతే అత్యంత ప్రాధాన్యమని, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు. అంతేకాకుండా, మహారాష్ట్రలోని గత మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని మోదీ విమర్శించారు. నవీ ముంబై విమానాశ్రయం, ఇతర కనెక్టివిటీ ప్రాజెక్టులతో ముంబై నగరం ప్రపంచస్థాయి వృద్ధి కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌పోర్ట్ 'వికసిత భారత్' సంకల్పానికి ప్రతీక. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను యూరప్, గల్ఫ్ దేశాలకు సులభంగా ఎగుమతి చేయవచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ముంబై మెట్రో లైన్-3 చివరి దశను కూడా ప్రారంభించారు. దీంతోపాటు 'ముంబై వన్ యాప్', యువతకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించే 'ముఖ్యమంత్రి షార్ట్-టర్మ్ ఎంప్లాయబిలిటీ ప్రోగ్రామ్ (స్టెప్)'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల కోసం విశేష కృషి చేసిన లోక్‌నేత డీబీ పాటిల్ సేవలను ఆయన స్మరించుకున్నారు.

# పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి కొత్త ఊపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణలో కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 11వ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ. 1.14 లక్షల కోట్ల విలువైన 30కి పైగా భారీ ప్రాజెక్టులకు మండలి ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 67 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో ఐటీ, ఇంధనం, పర్యాటకం, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలపై లోతుగా చర్చించారు. ప్రతి ప్రాజెక్టు అమలుకు ఉన్న అవకాశాలు, వాటి ద్వారా రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది ఐటీ రంగానికి సంబంధించింది. రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నిలిచే 'రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్' ప్రాజెక్టుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ఒక్క ప్రాజెక్టు విలువనే రూ. 87,520 కోట్లుగా ఉండటం విశేషం. ఈ భారీ పెట్టుబడిని రాష్ట్రానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "గడిచిన 15 నెలల కాలంలో పెట్టుబడులను ఆకర్షించడానికి మేము చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ రోజు తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రగతిలో ఒక మైలురాయిగా నిలుస్తాయి" అని అన్నారు. కేవలం పెట్టుబడులకు ఆమోదం తెలపడమే కాకుండా, వాటిని క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. ఆమోదం పొందిన భారీ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడానికి, కంపెనీలతో నిరంతరం సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటివరకు జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రాష్ట్రానికి మొత్తం రూ. 7.07 లక్షల కోట్ల పెట్టుబ డులకు ఆమోదం లభించిందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే రాష్ట్రంలో దాదాపు 6.20 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. తాజా నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు బలమైన పునాది పడుతోందని, పారిశ్రామికంగా రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కోర్టుల్లో జడ్జిలకు అర్థమయ్యేదాకా పోరాటం చేస్తాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై న్యాయస్థానాల్లో న్యాయమూర్తులకు అర్థమయ్యే వరకు పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద గ్రూప్-1 విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. యువకులు ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిందని, రాహుల్ గాంధీ అశోక్ నగర్ వెళ్లి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గ్రూప్-1 పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పటి వరకు ఇచ్చిందేమీ లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలనే భర్తీ చేశారని ఎద్దేవా చేశారు. గ్రూప్-1 అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలని ఆమె డిమాండ్ చేశారు.

# సమసిన "దున్నపోతు" వ్యాఖ్య వివాదం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రెండు రోజులుగా ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య నెలకొన్న అనుచిత వ్యాఖ్యల వివాదం ముగిసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం నాడు తన నివాసంలో ఇద్దరు మంత్రులతో సమావేశమయ్యారు. తనకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాకు పార్టీ సంక్షేమం తప్ప మరో దురుద్దేశం లేదని పొన్నం ప్రభాకర్ అన్నారు. అయితే తాను ఆ మాట అనకపోయినా మీడియాలో వచ్చిన కథనాలతో ఆయన బాధ పడ్డారు, కనుక అందుకు అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారు. తనకు అలాంటి ఆలోచన లేదు, ఆ ఒరవడి లో పెరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఆ సంస్కృతి నేర్పలేదు అన్నారు.

**అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ క్షమాపణ**

సామాజిక న్యాయానికి పోరాడే సందర్భంలో వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచుతాం. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంలో బలహీనవర్గాల బిడ్డగా రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42 శాతం రిజర్వేషన్ల కోసం మా పోరాటం జరుగుతుంది. మేమంతా ఐక్యంగా భవిష్యత్ లో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం పని చేస్తాం. అడ్లూరి లక్ష్మణ్ కి వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్తున్న.. కరీంనగర్ లో మాదిగ సామాజిక వర్గం మేమంతా కలిసి పెరిగాం. ఆ అపోహ ఉండవద్దని విజ్ఞప్తి చేస్తున్న' అని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ భేటీలో మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, శివసేన రెడ్డి ,సంపత్ కుమార్, అనిల్ ,వినయ్ కుమార్ పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇద్దరు మంత్రులను సమన్వయ పరిచారు. మంత్రుల మధ్య ఏర్పడ్డ అభిప్రాయ బేధాలను సరిదిద్దడంతో వివాదం సద్దుమణిగింది. తాను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, అయితే తన మాటలకు నొచ్చుకున్నారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**అడ్లూరి లక్ష్మణ్ నాకు సోదరుడిలాంటివారు.. పొన్నం ప్రభాకర్**

ఉదయం పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన చేశారు. 'మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాకు సోదరులవంటివారు. కాంగ్రెస్ లో మాకు 30 సంవత్సరాలుగా ఉన్న స్నేహబంధం రాజకీయాలకు మించినది. మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం ఎప్పుడూ అలాగే ఉంటాయి. నేను అడ్లూరి లక్ష్మణ్ పై ఎటువంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదు. అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన వ్యక్తిగా, బీసీ వర్గానికి చెందిన నేతనైన నాకు ఎవరిపైనా అలాంటి అభిప్రాయం ఉండదు. రాజకీయ దురుద్దేశంతో కొంతమంది నా వ్యాఖ్యలను వక్రీకరించి, వాస్తవానికి భిన్నంగా ప్రచారం చేసి చూపారు. దాంతో ఏర్పడిన అపార్థాల వల్ల అన్నలాంటి వ్యక్తి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మనసు నొచ్చుకుందని తెలిసి తీవ్రంగా విచారిస్తున్నాను. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మనసు నొచ్చుకొని ఉంటే అందుకు చింతిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో, రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం సాధనలో మేము ఇద్దరం కలిసికట్టుగా కృషి చేస్తామని' పొన్నం ప్రభాకర్ అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పతంగ్ పార్టీ వ్యూహం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. అయితే హైదరాబాద్ లో పట్టున్న ఎంఐఎం పార్టీ మాత్రం ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అసలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందా? లేదా? అన్నది కూడా అనుమానంగానే ఉంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎంఐఎం కీలక భూమిక పోషించనుంది. నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గతంలోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసింది. మిగిలిన పార్టీల కంటే అత్యధిక ఓట్లను ఎంఐఎం అభ్యర్థి సాధించింది. గతంలోనూ ఎంఐఎం తరుపున నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అత్యధిక ఓట్లను సాధించారు.

**బస్తీల్లో పట్టున్న..**

గెలవకపోయినా అత్యధిక ఓట్లను సాధించారు. గత ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఈసారి మాత్రం అజారుద్దీన్ పేరు కాంగ్రెస్ పార్టీలో వినిపించడం లేదు. కేవలం మూడు పేర్లను మాత్రమే అధినాయకత్వానికి పంపింది. అందులో నవీన్ యాదవ్ పేరు మొదట ఉంది. గతంలో నవీన్ యాదవ్ ఎంఐఎం పార్టీలో ఉన్నారు. శ్రీశైలం యాదవ్ కుమారుడైన నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ బస్తీలో మంచి పట్టు ఉండటం కూడా కలసి వస్తుందని భావిస్తుంది. అయితే ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఎంఐఎం తన పార్టీ అభ్యర్థిని నిలబెడుతుందా? లేక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు పలుకుతుందా? అన్నది మాత్రం తెలియాల్సి ఉంది.

**ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతో..**

ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతో ఎంఐఎం మిత్రుడిగా వ్యవహరిస్తుంది. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినప్పటి నాటి నుంచి ఎంఐఎం వైఖరి మారింది. అప్పటి వరకూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు మద్దతుగా ఉన్న ఎంఐఎం తర్వాత కాంగ్రెస్ కు అనధికార మిత్రపక్షంగా తయారైంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించే అవకాశాలను కొట్టిపారేయలేం. తాము పోటీలో నిలబడితే అది బీజేపీకి ప్లస్ గా మారుతుందని కూడా ఎంఐఎం భయపడే అవకాశముంది. అందుకే ఈ ఎన్నికలకు ఎంఐఎం దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరోక్షంగానో ప్రత్యక్షంగానో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మద్దతు పలికే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. త్వరలోనే దీనిపై స్పష్టత రానుంది.

## బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం

రాయవరం (ప్రశ్న న్యూస్)డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం నాడు భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలోని లక్ష్మి గణపతి బాణసంచా తయారీ కేంద్రంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటితో పాటు మంటల నుంచి బయటకు రాలేక ఊపిరాడక తీవ్ర కాలిన గాయాలతో ఆరుగురు మృతిచెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళలు ఉండగా, మరో ముగ్గురు మగవారు ఉన్నారు. మందుగుండు తయారు చేస్తుండగా బాణసంచా కాలడంతో తయారీ కేంద్రంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అక్కడ దట్టమైన పొగ అలుముకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పరిస్థితి గమనిస్తే మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది బాణసంచా తయారీ కేంద్రానికి చేరుకుమంటలు ఆర్పేందుకు శ్రమిస్తోంది. బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసిన సీఎం చంద్రబాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## నేడే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్

మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈ నెల 9న ప్రారంభమై నవంబర్ 11న ముగుస్తుంది.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 9న, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీలు, 27 సర్పంచ్, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేడు ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 11, ఆ తర్వాత రోజు నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 15న ఉపసంహరణ గడువు ఉంది. రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 13న నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 15, మరుసటి రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు అక్టోబర్ 19.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రభుత్వానికి చెక్ పడుతుంది

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందినప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయగలమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎవరికి అప్పగించిన పనులకు వారు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలని తెలిపారు. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు చేపట్టాలని అన్నారు. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని ఆకాంక్షించారు. ప్రచారం చివరి దశలో రోడ్డు షోలు నిర్వహించాలని నిర్ణయించారు.

## ఇండిగోపై భారీ జరిమానా 20 లక్షల జరిమానా విధించిన డీజీసీఏ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పైలట్ల శిక్షణ విషయంలో కీలక నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఇండిగో సంస్థకు డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) రూ. 20 లక్షల భారీ జరిమానా విధించింది. ఈ విషయాన్ని ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం, కేటగిరీ-సి ఏరోడ్రోమ్‌లలో పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు నిర్దేశిత ప్రమాణాలు కలిగిన సిమ్యులేటర్లను తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే, ఈ విషయంలో ఇండిగో విఫలమైందని డీజీసీఏ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 26న తమకు ఈ మేరకు డీజీసీఏ నుంచి ఆదేశాలు అందినట్లు కంపెనీ తన ఫైలింగ్‌లో వెల్లడించింది.

అయితే డీజీసీఏ విధించిన ఈ జరిమానాపై ఇండిగో స్పందించింది. ఈ ఆదేశాలను తాము అప్పిలేట్ అథారిటీ ముందు సవాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ జరిమానా వల్ల కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలు లేదా ఇతర వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని కూడా వివరించింది. డీజీసీఏ నుంచి ఆదేశాలు అంది చాలా రోజులు గడుస్తున్నా ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించడంలో జరిగిన జాప్యంపై కూడా కంపెనీ వివరణ ఇచ్చింది. ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు తమ అంతర్గత విభాగాల మధ్య చేరడంలో ఆలస్యం కావడం వల్లే ఈ జాప్యం జరిగిందని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని పేర్కొంది. కాగా, ఈ వార్తల నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బుధవారం ఇండిగో షేరు విలువ 0.59 శాతం తగ్గి రూ. 5,630.50 వద్ద ముగిసింది.

## వయనాడ్ బీభత్సం- బాధితుల విషయంలో కేంద్రం ఫెయిల్!: హైకోర్టు

2024లో వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనకు చెందిన బాధితులు పొందిన రుణాలను మాఫీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను వినియోగించుకోకపోవడం ద్వారా విఫలమైందని కేరళ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్, జస్టిస్ జోబిన్ సెబాస్టియన్‌లతో కూడిన ధర్మాసనం బాధితుల రుణాలను మాఫీ చేయకూడదనే కేంద్ర ప్రభుత్వ వైఖరిని దురదృష్టకరంగా అభివర్ణించింది.

వయనాడ్ బాధితులపై బ్యాంకులు తీసుకునే రికవరీ చర్యలను తుది పరిష్కారం అయ్యే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. రుణాలను తిరిగి పొందడానికి సంబంధిత బ్యాంకులు అనుసరించే పద్ధతులను మౌనంగా చూడకూడదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73 ప్రకారం తనకు విస్తారమైన అధికారాలు ఉన్నాయని, అలా వ్యవహరించడానికి తాము శక్తిహీనులమని కేంద్రం చెప్పడాన్ని అంగీకరించలేమని ధర్మాసనం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్య బాధితుల జీవించే ప్రాథమిక హక్కును కాపాడటానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన బాధ్యత రాజ్యాంగబద్ధంగా ఉందని భావించిందని కోర్టు చెప్పింది. "ఈరోజు (అక్టోబర్ 8, 2025) ఒక వార్తా నివేదిక నుంచి కేంద్ర ప్రభుత్వం 2024లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ప్రభావితమైన అసోం, గుజరాత్ రాష్ట్రాలకు అదనపు కేంద్ర సహాయం ద్వారా రూ. 707 కోట్ల సహాయాన్ని ఆమోదించింది. రుణ మాఫీ ద్వారా తక్షణ ప్రక్రియలో కోరిన ద్రవ్య ఉపశమనం పైన పేర్కొన్న వార్తా నివేదికలో సూచించిన గణాంకాలలో ఒక భాగం మాత్రమే" అని పేర్కొంది. ఇలాంటి పరిస్థితులలో కేంద్రం అఫిడవిట్‌లో చేసిన సమర్పణలు వయనాడ్ విషాద బాధితులకు సహాయం చేయడానికి ఇష్టపడకపోవడాన్ని సూచిస్తున్నాయని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ప్రకారం ఊహించిన సమాఖ్య సూత్రం ఏ ప్రత్యేక రాష్ట్రంలోనైనా పౌరులకు కేంద్ర ప్రభుత్వం భిన్నమైన చికిత్సను అనుమతించదని కోర్టు ఎత్తి చూపింది. "ప్రజాస్వామ్య గణతంత్రంలో ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణకు రాజ్యాంగ హామీని పార్టీ రాజకీయాలు తిరస్కరించలేవు. ప్రస్తుత సందర్భంలో ప్రమాదంలో ఉన్నది వయనాడ్ కొండచరియ బాధితుల గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే ప్రాథమిక హక్కు" అని పేర్కొంది. కొండచరియ బాధితులు వ్యవసాయం, సంబంధిత ప్రయోజనాల కోసం పొందిన రుణాలను తిరిగి చెల్లించమని అడగడం వారి గౌరవానికి అవమానమని కోర్టు తెలిపింది. "అధికారాన్ని ఉపయోగించాల్సిన పరిస్థితిలో వారికి ఉన్న అధికారాన్ని ఉపయోగించుకోవడానికి నిరాకరించడం ద్వారా, కేంద్ర ప్రభుత్వం వయనాడ్ బాధితులను వాస్తవంగా విఫలం చేసిందని మేం భావిస్తున్నాము" అని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ప్రకారం అధికారాల విభజన దృష్ట్యా, పరిస్థితి చికాకు పుట్టించేలా ఉన్నప్పటికీ, ఆర్థిక విధానంపై కేంద్రం నిర్ణయాన్ని వాయిదా వేయబోతోందని కోర్టు తెలిపింది. అదే సమయంలో సంబంధిత బ్యాంకులు తాము ఇచ్చిన రుణాలను తిరిగి పొందడానికి అనుసరించే షైలాకియన్ పద్ధతులను తాము మౌనంగా చూడలేమని కోర్టు పేర్కొంది. 12 బ్యాంకులను ఇంప్లీడ్ చేయాలని ఆదేశించింది. వయనాడ్ కొండచరియ బాధితులపై వారు ప్రారంభించిన ఏవైనా రికవరీ చర్యలను పిటిషన్ చివరకు పరిష్కరించే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. బాధితులు పొందిన రుణాలను పూర్తిగా లేదా పాక్షికంగా మాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నారా లేదా అని స్పష్టంగా పేర్కొంటూ అఫిడవిట్‌లను దాఖలు చేయడం ద్వారా బ్యాంకులు తక్షణ ఉత్తర్వులను సవరించాలని కోరవచ్చని ధర్మాసనం పేర్కొంది. రుణం తిరిగి చెల్లించాలని కోరుకునే రుణ ఒప్పందాల నిబంధనలకు సంబంధించి, వడ్డీతో సహా బ్యాంకులు దానికి సమర్థన ఇవ్వాలని కోర్టు పేర్కొంది. అక్టోబర్ 29కి తదుపరి విచారణకు జాబితా చేసింది. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ కొండచరియలు విరిగిపడిన బాధితుల రుణాలను మాఫీ చేయడంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి సంకోచం లేదని అన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
గురువారం 09 అక్టోబర్2025

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి. ఎర్రవెల్లి ముత్యంరావు



మంథని ( ప్రశ్న న్యూస్)మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ ఈనెల 14 15 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఈ మాసభలకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఉపాధ్యాక్షులు భూపాల్ హాజరవుతున్నారని అన్నారు మొదటిరోజు భారీ బహిరంగ సభ ప్రదర్శన ఉంటుందని రెండవ రోజు ప్రతినిధుల సభ జరుగుతుందని అన్నారు గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ యూనియన్ నాయకులు చందు మల్లేష్ గట్టయ్య భాగ్య పోచమ్మ తదితరులు పాల్గొన్నారు

## నకిలీ మద్యాన్ని ప్రోత్సహించింది వైసీపీ ప్రభుత్వమే.

### రాష్ట్ర గిరిజన సలహా మండలి డైరెక్టర్ సుబ్బయ్య



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి గతంలో 2019 నుంచి 2024 దాకా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రంలో మద్యం ఏరులై పారించలేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి సభ్యుడు ఎం సుబ్బయ్య అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దాదాపు రాష్ట్రంలో 40 వేల మద్యం బెల్టు షాపులకు అనుమతి ఇచ్చి విచ్చలవిడిగా కల్తీ మద్యాన్ని అమ్మి ఆరోజు ప్రజల ప్రాణాలు బలి తీసుకుందన్నారు. అమాయకులైన ఎంతోమంది ప్రజలు మీ ప్రభుత్వం అమ్మిన కల్తీ మద్యాన్ని తాగి మృతి చెందటంతో ఎన్నో కుటుంబాలు అనాథలు అయ్యారన్నారు. అలాంటి పార్టీ మీ వైసీపీ పార్టీ అదే మా తెలుగుదేశం పార్టీలో తప్పు ఎవరు చేసినా వెంటనే తగిన శిక్ష వేస్తారని మొన్నటి తంబళ్లపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి.జై చంద్ర రెడ్డి ని నకిలీ మద్యం అన్నాడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి వచ్చిన వెంటనే సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. మరి క్రమశిక్షణ కి మారుపేరు వినయ విధేయత కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ మరి ఆనాడు వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రథమ ముద్దాయిగా అవినాష్ రెడ్డి ఉన్నాడని తెలిసిన రోజు నిండు శాసనసభలో జగన్మోహన్ రెడ్డి అవినాష్ రెడ్డి నా తమ్ముడు నా ఎడంకన్ను అని ఒక అత్యా నేరం మోపబడిన అవినాష్ రెడ్డిని పొగడలేదా గుర్తు చేసుకో జగన్మోహన్ రెడ్డి. మరి మీరు గొప్ప మేం గొప్ప ఎప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ వినయ విధేయత కలిగి ఉంటాది తప్పులు చేసిన వారిని మందలించి తెలుగుదేశంపార్టీ నుంచి తొలగించి తగిన బుద్ధి చెబుతారు. అలాంటి పార్టీ తెలుగుదేశం పార్టీ మరి మీ వైసీపీ పార్టీ లాగా తప్పులు చేసే వారిని భుజాల మీదకి ఎక్కించుకొని వేడుకగా తిరగలేదు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండల డైరెక్టర్ సుబ్బయ్య తెలిపారు.

## మాక్స్ ఇన్ఫ్రా పారిశ్రామిక వేత్త ఇవిఎస్ రాజు దాతృత్వం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హైదరాబాదు మాక్స్ ఇన్ఫ్రా పరిశ్రమకవేత్త ఇవిఎస్ రాజు 10 లక్షలు విలువచేసే మెడికల్ సామాగ్రిని అందజేశారు. ఈ మెడికల్ సామాగ్రిని శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి అయ్యేవిధంగా దాతలు ముందుకు వచ్చి ఆసుపత్రికి కావలసిన వస్తువులను అందజేయడం హర్షినిద్రతగ్గ విషయమై నేడు 10 లక్షల రూపాయలు విలువచేసే సామాగ్రిని అందజేసిన హైదరాబాద్ పారిశ్రామికవేత్త ఈవీఎస్ రాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, టిడిపి నాయకులు చెంచయ్య నాయుడు, గాదిపాకుల గోపి, సుమతి, ఆసుపత్రి కమిటీ మెంబర్లు గరికపాటి రమేష్ బాబు, వినయ్ టిడిపి నాయకులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సెటిల్మెంట్ కోసమేనా.?

# సీజ్ చేయకుండా ఆపారు

**-అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల వెనకడుగు**

**-అధికారుల లంచాల దాహానికి జిహెచ్ఎంసి నియమ నిబంధనలు గాలిలో**

**-అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశాలు ఉన్న పాటించేది ఎవరు.?**

**-కమిషనర్ ఆదేశాలను అమలుపరచడంలో పూర్తిగా విఫలమైన డిప్యూటీ, జోనల్ కమిషనర్లు**







**సీతాఫలమండి(ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. అధికారులకు ఫిర్యాదులు చేసిన, పత్రికలో కథనాలు వచ్చిన చర్యలు తీసుకోకుండా కాలక్షేపం చేయడం వెనకాల లంచాల కోసమే ఆశ పడుతున్నారా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చాలావరకు సీతాఫలమండి, బౌద్ధ నగర్ డివిజన్లో బిల్డర్లు చిన్న చిన్న గల్లీలలో 5, 6 అంతస్తుల అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు చేసి లక్షలలో అమ్ముకుంటారు. దానికి టౌన్ ప్లానింగ్ చైన్ మెన్, సెక్షన్ ఆఫీసర్, ఏసిపి, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ వరకు పూర్తిగా సహకరిస్తారు. ఎందుకంటే ఎవరి వాటా వాళ్లకు వెళుతుంది కాబట్టి ఇది అక్రమమని ఎవరైనా ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉంటారు. అధికారుల అవినీతి తీవ్ర స్థాయికి చేరింది. ప్రజల పక్షాన ప్రశ్నించి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోమని గెలిపించిన కార్పొరేటర్లు అధికారులకు అండగా నిలిచి అక్రమాలకు సై అంటారు. ఇందులో వీళ్లకు కూడా పారితోషకం బాగానే ఉంటుంది దానికి తోడు కొన్ని అక్రమ నిర్మాణాలలో ముందుగానే కార్పొరేటర్లు అందిన కాడికి దండుకొని అధికారులకు అది మనకు తెలిసిన వాళ్ళది లేదా నీకింత నాకింత అంటూ బేరసారాలు చేసి అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోకుండా ముందుగానే సెటిల్మెంట్లు చేసుకుంటారు. ఇలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా 30 వేల నుండి 30 లక్షల వరకు అన్నట్లుగా హ్యాపీగా జరుగుతుంది. ఇదంతా డిప్యూటీ, జోనల్ కమిషనర్ల కనుసైగల్లో జరుగుతుందన్నది బహిరంగ రహస్యమే. బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో పక్కింటి నెంబర్ 12%-11-%1153 పక్కన ఒక భవనం 6 అంతస్తులు, మరొక భవనం 5 అంతస్తులు బయట వైపు రంగులు వేసి లోలోపల పనులు చేస్తున్నారు వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన ఇప్పటివరకు భవనాలను సీజ్ చేయకుండా కూల్చివేతలు చేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు కాపాడడం వెనక అంతర్యం ఏమిటో జిహెచ్ఎంసి కమిషనర్ కె తెలియాలి. డిప్యూటీ కమిషనర్లు జోనల్ కమిషనర్లు ఉన్నత అధికారులు ప్రజావాణిలో కానీ ఇన్వార్డులో కానీ అక్రమ నిర్మాణాలపై ఈ అధికారులకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేస్తే మరి దానిని అవినీతికి పాల్పడుతున్న ఏసీపీలకే ఫార్వర్డ్ చేసి చేతులు దులుపుకుంటారు. అంటే అర్థం చేసుకోవచ్చు డిప్యూటీ కమిషనర్ల జోనల్ కమిషనర్ల హస్తం ఎంత ఉందో అని అదే అవినీతికి పాల్పడని లంచాలు తీసుకొని డిప్యూటీ, కమిషనర్ జోనల్ కమిషనర్ లు ఉండి ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకొనేవారు అలా తీసుకోలేదు కాబట్టే ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ అంతస్తులు, అక్రమ అపార్ట్మెంట్లు తో నిండిపోయింది. దానితో ట్రాఫిక్, బోరు నీరు, తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయి. అయిన మన అధికారులు లంచాలు తీసుకోవడంలో అక్రమాలు చేయించడంలో తగ్గేదేలే అన్నట్లు మారారు. మరి పాలించే మంత్రులైన, ముఖ్యమంత్రి అయిన చర్యలు తీసుకుంటారా అంటే అది లేదు ఇలా తిల పాపం తలపిడికాడు అన్నట్లుగా వాళ్లు కూడా మౌనం వహించడంతో అవినీతి అక్రమాలే రాజ్యమేలుతున్నాయి. చర్యలు ఎవరు తీసుకుంటారు అంటే కోర్టును ఆశ్రయించాలి అందులో ఎన్నో మెలకలు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ శాఖకు అడ్వకేట్లుగా వ్యవహరిస్తారు ఇక వాళ్ల లంచాల దాహానికి అవినీతికి అంతే ఉండదు జిహెచ్ఎంసికి న్యాయం అనే మాట చేయకుండా ఎదుటి పార్టీకి అమ్ముడుపోయి పూర్తిగా అవినీతి చేయడంలో వాళ్ళని మించిన వాళ్లు మరొకరు లేరన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక సాధారణ వ్యక్తి కోర్టుని ఆశ్రయిస్తే న్యాయం జరుగుతదా అంటే కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయరు టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకంటే ముందుగానే లంచాలు తీసుకున్నారు కాబట్టి ఇలా అవినీతి మాయలో అక్రమ నిర్మాణాల దందా హ్యాపీగా జరుగుతుంది.

## ఆలయ అభివృద్ధి పేరుతో దర్శనాలు నిలిపే ప్రయత్నాన్ని వెనక్కి తీసుకోవాలి

**- రాజన్న దర్శనాలు నిలిపితే బీజేపీ ఆందోళనలు తప్పవు**

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపల్లి శ్రీధర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పేరుతో దర్శనాలు నిలిపివేయాలనే యత్నాలు జరుగుతున్నాయనే సమాచారం పట్ల బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, భక్తుల విశ్వాసాలతో ప్రభుత్వం ఆటలాడకూడదని హెచ్చరించారు.బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేశారు. కానీ ఎక్కడా దర్శనాలు నిలిపిన సందర్భం లేదు. వేములవాడలో అలాంటి నిర్ణయం తీసుకుంటే ప్రజా వ్యతిరేకంగా భావించి బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు ప్రారంభిస్తుంది," అని హెచ్చరించారు. హిందూ ఆలయాల ప్రాంగణంలో దర్గాలు ఉండవని, కానీ వేములవాడలో దర్గా ఎందుకు ఉందో ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. "హిందూ ఆలయాల్లో సమాధులు ఉంటే అవి తొలగించాలి. భక్తుల మనోభావాలను కించపరిచే చర్యలు బీజేపీ సహించదు," అని శ్రీధర్ స్పష్టం చేశారు. అనంతరం బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, "భీమన్న గుడి పనులు పూర్తికాకముందే రాజన్న దర్శనాలను నిలిపేస్తారని వినిపిస్తోంది. అలాంటి నిర్ణయం తీసుకుంటే ఉద్యమ రూపంలో నిరసనలు ప్రారంభిస్తాం," అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి హన్మాండ్లు,గుడిసె మనోజ్, వివేక్ రెడ్డి,కట్కం శ్రీనివాస్, రేగుల రాజకుమార్,మామిండ్ల లక్ష్మీరాజం, సగ్గు రాహుల్, బిల్ల కృష్ణ,నామాల శేఖర్, నేరెళ్ల సాయి,కీసర యశ్వంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## యువత క్రీడా రంగంలో రాణించాలి

**మై భారత్ వాలంటీర్ : గంగిపల్లి స్వామి కుమార్**

**కొదురుపాకలో ఘనంగా ముగిసిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక స్పోర్ట్స్ క్లబ్,మై భారత్ సంస్థ ఆధ్వర్యంలో కొదురుపాక గ్రామంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా,ఘనంగా జరిగాయి. ఈ క్రీడల్లో వాలీబాల్ విభాగంలో 14 జట్లు, కబడ్డీ విభాగంలో 8 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ విభాగంలో బోయినిపల్లి జట్టు మొదటి బహుమతి, నర్సింగాపూర్ జట్టు రెండో బహుమతి గెలుచుకున్నాయి. వాలీబాల్ విభాగంలో కొదురుపాక జట్టు విజేతగా నిలిచి, విలాసాగర్ జట్టు రన్నరప్ బహుమతి అందుకుంది.
ఈ సందర్భంగా మై భారత్ వాలంటరీ గంగిపల్లి స్వామి కుమార్ మాట్లాడుతూ, "యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడారంగంలో రాణించాలని, ఉన్నత విద్యతోపాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని" అన్నారు. నేటి యువత సమయాన్ని వృథా చేయకుండా అంకితభావంతో క్రీడల వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొదురుపాక స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు రాకం రాజేష్, నాగుల వెంకటేష్, ఒజ్జెల అభి, మైలారం రాజు, నజీర్, కొండం శ్రీనివాస్ రెడ్డి, సారంపల్లి రాజు, రాజేంద్ర ప్రసాద్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాప్‌పై మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి మద్యం

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళకల్ల గ్రామంలో ప్రభాకర్ గౌడ్ కిరాణా షాప్ లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు.దాడి సమయంలో కిరాణా షాప్‌లో విక్రయిస్తున్న మొత్తం 120.150 లీటర్ల అక్రమ మద్యం ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మద్యం మరియు నిందితుదిని మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ కు అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు, రవాణా, నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని తెలిపారు.



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



## తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పోతుల హరిబాబు రెడ్డి




మేడ్చల్( ప్రశ్న న్యూస్) తెలంగాణ రెడ్డీసంఘాలకు రాష్ట్ర ఉపాధ్యక్షులు గా పోతులహరిబాబు రెడ్డి నీ నియమించబడ్డారు. రాష్ట్ర అధ్యక్షులు గా ప్రధాన కార్యదర్శులు ఏనుగు సంతోష్ రెడ్డి , సంధి తిరుపతి రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం ఇవ్వడం అయినది ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పోసానిపల్లి మహిపాల్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్లపల్లి శ్రీనివాస్ రెడ్డి , ఉపాధ్యక్షులు దోసడి రామచంద్రారెడ్డి , కొడకండ్ల దుర్గా రెడ్డి , కోమ్ రెడ్డి మహేశ్ రెడ్డి మరియు రాష్ట్ర రెడ్డి సంఘం ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిబాబు రెడ్డి మాట్లాడుతూ రెడ్డి ఐక్య వేదిక అభ్యున్నతికి అలాగే రెడ్డి ఐక్యవేదిక చేపట్టే అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ సహాయ సహకార అందించి రెడ్డి జాతి యొక్క ఆర్థిక సామాజిక రాజకీయ వైభవం పెంపొందించే విధంగా మరియు రాష్ట్ర సంఘం కార్యవర్గ నియమాలకు లోబడి పని చేస్తానని ఈ సందర్భంగా తెలియజేయడమైనది. నాకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి కి మరియు రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## భూభారతి రెవెన్యూ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి : కలెక్టర్ సత్య ప్రసాద్

**-భూభారతి రెవెన్యూ సదస్సుల**

**దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్లో సమావేశం**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్లో సమీక్ష సమావేశం కలెక్టర్ సత్యప్రసాద్ నిర్వహించారు.కలెక్టరేట్ మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశంలో గత భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వీలైనంత తొందరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తహసీల్దారులని ఆదేశించారు.ఆర్ ఎస్సార్ తేడా ఉన్న సర్వే నెంబర్ ల మీద క్షేత్ర స్థాయిలో, రికార్డు పరంగా విచారణ చేసి సరి చేయాలనీ ,సాధబైనమా కేసులను పరిష్కరించాలని, అసైన్మెంట్ కేసుల్లో ఎంక్వైరీ పూర్తి చేయాలని,కోర్టు కేసుల్లో ఉన్న భూముల విషయం లో కౌంటర్ దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. భూసేకరణ విషయంలో తొందరగా అవార్డు చేయాలని , ఫారెస్ట్ రెవెన్యూ వివాదాలు జాయింట్ సర్వే చేసి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ , అసైన్డ్ ,ఇరిగేషన్, భూదాన్, వక్ఫ్, ఎండోమెంట్ ,శిఖం భూములకు జీ ఐ ఎస్ బేస్డ్ సర్వే మ్యాప్ తయారు చేసి సంబంధిత సైట్ లో అప్లోడ్ చెయ్యాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి, జగిత్యాల కోరుట్ల మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు,జిల్లా తహసీల్దార్లు పాల్గొన్నారు.

## మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ముందు గిర్మాపూర్ వాసుల ధర్నా

**హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు అర్ధాంతరంగా ఆగిన రోడ్డు**

**మరమ్మత్తులు పూర్తి చేయాలని డిమాండ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ హౌసింగ్ బోర్డు నుండి లైబ్రరీ వరకు గల రోడ్డును మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేస్తూ గిర్మాపూర్ వాసులు కదం తొక్కారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. మేడ్చల్ హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు రోడ్డు గుంతల మయంగా మారడంతో గిర్మాపూర్ గ్రామానికి రావాల్సిన ఆర్టీసీ బస్సులు రావడంలేదని దీనివల్ల గ్రామ ప్రజలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గిర్మాపూర్ వాసులు ఆరోపిస్తున్నారు. గత కొద్ది రోజుల నుండి ఈ రోడ్డు దయనీయ స్థితికి చేరడంతో గిర్మాపూర్ వైపు వెళ్ళు ఆర్టీసీ బస్సులను ఆర్టీసీ రద్దు చేసిందని ఆరోపించారు . ఈ విషయం పేపర్లో పలు కథనాలు వచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. ఆర్టీసీ గిర్మాపూర్ వైపు వెళ్ళు బస్సులను రద్దు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మేడ్చల్ లోని హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిర్మాపూర్ వాసులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా పటాకులు అమ్మకూడదు

**జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ రెడ్డి హెచ్చరిక**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) దీపావళి సందర్భంగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా పటాకులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ రెడ్డి హెచ్చరించారు గ్రామాలలో, పట్టణాలలో బాణసంచా దుకాణాలు పెట్టి పటాకులు అమ్మాలనుకునే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు పటాకులు అమ్ముకోవాలను కుంటున్నారు (తెలంగాణ ప్రభుత్వం. ఇన్ ) తెలంగాణ గవర్నమెంట్ లో ఒరిజినల్ లాగిన్ లోకి వెళ్లి మెయిల్ తో లాగిన్ అయిన తర్వాత టెంపరరీ, పర్మినెంట్, గోడౌన్ షాపు అనే మూడు ఆప్షన్ లో సెలెక్ట్ చేసుకోవాలనుకుంటున్నారో అది సెలెక్ట్ చేసుకొని 500 రూపాయల చాలన్ కట్టి లైసెన్స్ పొందాలని సూచించారు. అలా కాకుండా ఎవరు పడితే వారు ఇష్టానుసారంగా బాణసంచా దుకాణం నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా దుకాణాలలో పటాకులు కాల్చే ప్రదేశంలో ఫైర్ యాక్సిడెంట్ జరిగినట్లయితే 101 కు ఫోన్ చేస్తే వెంటనే ఫైర్ సిబ్బందిని పంపించి ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామని తెలిపారు.

**జాగ్రత్తగా పటాకులు కాల్చాలి**

దీపావళి పండుగ సందర్భంగా షామీర్పేట్ మూడు చిత్తలపల్లి మేడ్చల్ మండలాల ప్రజలు దీపావళి వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ రెడ్డి తెలిపారు. బాణసంచ దుకాణాలు నడిపేవారు, పటాకులు కాల్చేవారు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పటాకులు కాల్చేవారు దగ్గరలో వాటర్ డ్రమ్స్ పెట్టుకోవాలని, ఫైర్ సేఫ్టీ కిట్ బాణాసంచ దుకాణాల్లో కచ్చితంగా ఉండాలని, పటాకులు కాల్చేవారు జాగ్రత్తగా కాల్చాలని సూచించారు. కాలుష్యం కాకుండా పటాకులు కాల్చాలని, కాల్చిన పటాకులు చల్లారే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగునిచ్చే దీపావళి పండుగను ఎలాంటి చేదు అనుభవాలు ఎదురుకాకుండా సంతోషంగా జరుపుకునేలా చూసుకోవాలని సూచించారు.

# పాకిస్థాన్ లో దరిద్రం తాండవిస్తోంది

**ప్రపంచ బ్యాంకు కీలక నివేదిక**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆ దేశం దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతోందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వంటి సంస్థల నుంచి భారీగా రుణాలు తీసుకుంటున్నా దేశంలో పేదరికం తగ్గకపోగా మరింత తీవ్రమవుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో అమలవుతున్న ఆర్థిక వృద్ధి నమూనా పూర్తిగా విఫలమైందని, పేదల జీవితాలను మెరుగుపరచడంలో ఘోరంగా విఫలమైందని స్పష్టం చేసింది. ఈ మేరకు 'రిక్లెయిమింగ్ మొమెంటం టువార్డ్స్ ప్రాస్పరిటీ: పాకిస్థాన్స్ పావర్టీ, ఈక్విటీ అండ్ రెసిలియెన్స్ అసెస్‌మెంట్' పేరుతో సెప్టెంబర్ 23న విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, పాకిస్థాన్‌లో పేదరికం హెడ్‌కౌంట్ నిష్పత్తి (హెచ్‌సీఆర్) గత ఎనిమిది సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి, అంటే 25.3 శాతానికి చేరింది. కేవలం 2023 నుంచి చూస్తేనే ఇది 7 శాతం పెరుగుదల కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒకప్పుడు పాకిస్థాన్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించింది. 2001లో 64.3 శాతంగా ఉన్న పేదరికాన్ని 2018 నాటికి 21.9 శాతానికి తగ్గించగలిగింది. 2015 వరకు ఏటా 3 శాతం చొప్పున పేదరికం తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత దాని వేగం సంవత్సరానికి ఒక శాతం కంటే తక్కువకు పడిపోయింది. అయితే, ప్రభుత్వాల విధానాలు, వరుస సంక్షోభాల కారణంగా కష్టపడి సాధించిన ఈ ప్రగతి పూర్తిగా తలకిందులైందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొంది.పేదరిక నిర్మూలనకు గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టాల్సింది పోయి, పాకిస్థాన్ ప్రభుత్వం రక్షణ రంగ వ్యయాన్ని పెంచుకోవడంపైనే అధికంగా దృష్టి సారించిందని నివేదిక విమర్శించింది. దేశ జనాభాలో 42.7 శాతంగా ఉన్న మధ్యతరగతి వర్గాలు సైతం పూర్తి ఆర్థిక భద్రతను సాధించేందుకు తీవ్రంగా పోరాడుతున్నారని, ఇది కేవలం పేదల సమస్య మాత్రమే కాదని, దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులే బలహీనంగా ఉన్నాయని సూచిస్తోందని తెలిపింది. గతంలో విజయవంతమైన ఆర్థిక నమూనా ఇప్పుడు తన పరిమితులను చేరుకుందని, చిన్నపాటి ఆర్థిక కుదుపులకే ప్రజలు తిరిగి పేదరికంలోకి జారిపోయే ప్రమాదం ఉందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి, దేశాన్ని అతలాకుతలం చేసిన వరదలు, రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం, ఆర్థిక అస్థిరత వంటి వరుస సంక్షోభాలు పాకిస్థాన్ వ్యవస్థలోని బలహీనతలను బయటపెట్టాయని నివేదిక స్పష్టం చేసింది. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజలు విఫలమవుతున్నారని, తక్కువ ఉత్పాదకత ఉన్న రంగాల్లో చిక్కుకుపోయారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడాలంటే, పాకిస్థాన్ ప్రభుత్వం సాహసోపేతమైన విధాన సంస్కరణలను తక్షణమే చేపట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. వ్యవస్థాగత అసమతుల్యతలను సరిదిద్దడం, సంక్షోభాల సమయంలో ప్రజలు తిరిగి పేదరికంలోకి జారకుండా చూడటం, మారుమూల ప్రాంతాల్లోని సవాళ్లను పరిష్కరించడం అత్యవసరమని నొక్కి చెప్పింది. 2000ల ప్రారంభం తర్వాత పాకిస్థాన్‌పై విడుదల చేసిన మొట్టమొదటి సమగ్ర పేదరిక అంచనా నివేదిక ఇదేనని, విధాన రూపకర్తలకు, భాగస్వామ్య పక్షాలకు ఇది ఒక మార్గదర్శి (రోడ్‌మ్యాప్)గా ఉపయోగపడుతుందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. దేశంలో పేదరికం, అసమానతల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ నివేదిక దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

# 20 వేలు లంచం తీసుకుంటూ అనిశా వలలో పడ్డ డ్రగ్స్ కంట్రోల్ తిమింగలాలు

**-మెడికల్ షాపు రెన్యూవల్ కోసం రూ.20 వేల లంచం**

**-అసిస్టెంట్ డైరెక్టర్ మరియాల శ్రీనివాసులు,డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్**

**-డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకోవడానికి బినామీ పుల్లూరి రాము**

**-ముగ్గురిపై కేసు నమోదు కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ**

**-లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు కాల్ చెయ్యండి : ఏసీబీ**

**-వాట్సాప్: 9440446106**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)డ్రగ్ కంట్రోల్ శాఖకు చెందిన అవినీతి చేపలు ఏసీబీకి చిక్కాయి. విజేత హాస్పిటల్ సంబంధించిన మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ కోసం నిర్వాహకుడిని రూ. 20వేల లంచం డిమాండ్ చేసి, ప్రైవేట్ అసిస్టెంట్ ద్వారా తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.కరీంనగరంలోని విజేత హాస్పిటల్ సంబంధించిన మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ కోసం నిర్వాహకుడు కరీంనగర్‌లోని డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నాడు.అయితే రెన్యూవల్ చేసేందుకు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మరియాల శ్రీనివాసులు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ కలిసి ప్రైవేట్ అసిస్టెంట్ పుల్లూరి రాము ద్వారా ఫార్మసీ నిర్వాహకుడిని రూ. 20వేలు డిమాండ్ చేశారు. దీంతో నిర్వాహకుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలో ప్రైవేట్ అసిస్టెంట్ రాము ఫార్మసీ నిర్వాహకుడి నుంచి రూ. 20వేలు లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# వైద్య రంగంలో ఆవిష్కరణలకు ముగ్గురికి నోబెల్ బహుమతి



**-రోగనిరోధక వ్యవస్థ పరిశోధనలో**

**-ప్రతి ఏడాది డిసెంబర్ 10 న నోబెల్ దినోత్సవం**

**-ఆ రోజు ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి**

**-మొదటి నోబెల్ బహుమతి 1901లో ప్రదానం**

**-మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.**

**-రెండవ ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.**

హైదరాబాద్(ప్రశ్న న్యూస్)ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతి విజేతల పేర్లను ప్రకటించారు. తొలి నోబెల్ బహుమతి వైద్య రంగంలో ముగ్గురు వైద్యులకు సంయుక్తంగా లభించింది. అమెరికాలోని సీటెల్‌కు చెందిన మేరీ ఇ. బ్రుంకో, శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన ఫ్రెడ్ రామ్స్‌డెల్, జపాన్‌కు చెందిన షిమోన్ సకాగుచిలకు ఈ బహుమతి వరించింది. బ్రుంకో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ బయాలజీ విభాగంలో పని చేస్తుండగా, రామ్స్‌డెల్ సోనోమా బయోథెరప్యూటిక్స్ విభాగంలో పని చేస్తున్నారు. సకాగుచి జపాన్‌లోని ఒసాకా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. నోబెల్ బహుమతుల విజేతల పేర్లను అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రకటించనున్నారు."మేరీ ఇ. బ్రూనో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచి ముగ్గురు రోగనిరోధక వ్యవస్థ ఎలా నియంత్రించబడుతుందో పరిశోధించారు. ఈ పరిశోధనలో వారి ఆవిష్కరణల ఫలితంగా ఈ ముగ్గురినీ నోబెల్ బహుమతి వరించింది. వారి ఆవిష్కరణలు కొత్త పరిశోధనా రంగానికి పునాది వేయడంతో పాటు, క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు వంటి రోగాలకు కొత్త చికిత్సల అభివృద్ధికి ప్రేరణనిచ్చాయి" అని నోబెల్ కమిటీ పేర్కొంది.

**నోబెల్ బహుమతుల చరిత్ర..**

ప్రముఖ వ్యాపారవేత్త, శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణం తరువాత ఈ నోబెల్ బహుమతులు అందజేస్తున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన సంపదలో ఎక్కువ భాగాన్ని వివిధ రంగాలలో బహుమతులను అందజేయడానికి వీలునామా రాశారు. 1895 నాటి ఆయన వీలునామా ప్రకారం "గత ఏడాదిలో, మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చిన వారికి" బహుమతులు ప్రదానం చేయాలని ఆయన నిర్దేశించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 10న నోబెల్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజు ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి. ఈ రోజున నోబెల్ బహుమతులు గ్రహీతలకు ప్రదానం చేస్తారు. మొదటి నోబెల్ బహుమతులు 1901లో ప్రదానం చేశారు. నాటి నుంచి ఏటా అందజేస్తున్నారు. అప్పటి నుంచి కొన్ని సార్లు నోబెల్ బహుమతులు ఇవ్వని సందర్భాలు కూడా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకు కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.

# హృదయ సంబంధ వ్యాధుల నిర్దారణ శిబిరాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)సాయి స్వస్థ వెల్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పుట్టుకతో వచ్చే హృదయ సంబంధ వ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుండె సంబంధించి సమస్యలను 2%ఐ% కో ద్వారా పరీక్షించి చికిత్స అవసరం ఉన్న వారిని సిద్దిపేట లోని శ్రీ సత్య సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స అందించనున్నారు. గుండె ఆపరేషన్లు చాలా ఖర్చుతో కూడుకున్నవని పేద ప్రజలు ఆపరేషన్లు చేయించుకునేంత స్తోమత ఉండదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాయి స్వస్థ వెల్ నెస్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత నిర్ధారణ పరీక్షలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సత్య సాయి వారి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంకు సమీపంలోని కొండపాకలోని వారి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా వైద్య పరీక్షలు,ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వివరించారు. ఇందుకుగాను ఆ సంస్థ నిర్వాహకులను, స్థానిక సాయి స్వాతంత్ర వెల్ నెస్ సెంటర్



బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తో పాటుగా కొండపాక ఆసుపత్రి నిర్వహణ ప్రతినిధి శర్మ, ఐ ఎం ఏ జగిత్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులు డా. హేమంత్, డా. శ్రీనివాస్ రెడ్డి, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సిరిసిల్ల శ్రీనివాస్, జగిత్యాల సాయి స్వస్థత వెల్ నెస్ సెంటర్ ప్రతినిధులు కోటగిరి శ్రీనివాస్, పాల్తెపు భూమేశ్వర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
గురువారం 09 అక్టోబర్2025

## ఎడిటోరియల్

# జాబితాలో లోపాలకు ఇసిదే బాధ్యత

భారతీయ ప్రజాస్వామ్య మూలస్తంభమైన ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ)పై ఉంది. అయితే ఇటీవల కర్నాటకలోని అలంద్ నియోజకవర్గం, అలాగే మహారాష్ట్రలోని రాజురా అసెంబ్లీ సీటులలో వెలుగుచూసిన ఓటర్ల జాబితా అక్రమాల ఆరోపణలు ఈ సంస్థ పారదర్శకత, నిష్పాక్షికతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. 2022 డిసెంబర్‌లో అలంద్‌లో ఆన్‌లైన్ ఫారం 7 ద్వారా 6,018 ఓటర్ల తొలగింపు అభ్యర్థనలు వచ్చాయి. వీటిలో కేవలం 24 మాత్రమే నిజమైనవిగా గుర్తించబడ్డాయి. మిగిలిన 5,994 మోసపూరితమైనవిగా తేలాయి. ఇది కేవలం స్థానిక సమస్య మాత్రమే కాదు. ఒక పెద్ద పథకం ప్రకారం జరిగిన కుట్రగా కనిపిస్తున్నది. ఎందుకంటే ఇలాంటి అక్రమాలు మహారాష్ట్రలోనూ జరిగాయి. అక్కడ రాజురాలో 6,850కి పైగా బోగస్ ఓట్ల చేర్పులు జరిగాయి. ఈ ఘటనలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి జరిగిన ఉద్దేశపూర్వక ప్రయత్నాలుగా (కుట్ర)గా చూడాలి. ఈ విషయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రవర్తన, ప్రతిస్పందనలు మరింత సందేహాలను కలిగిస్తున్నాయి.  పాలస్తీనా హసించేనా? ఈ అక్రమాలు మొదట అలంద్‌లో బయటపడ్డాయి, అక్కడ బూత్ లెవల్ అధికారి (బిఎల్‌ఒ) ఒకరు తమ సొంత కుటుంబ సభ్యుల పేర్లు తొలగింపును గమనించి అప్రమత్తమయ్యారు. ఈ అభ్యర్థనలు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన మొబైల్ నంబర్లతో నమోదు చేయబడ్డాయి. , చెన్నై, మహారాష్ట్ర మొదలైనవి. అలాగే ఇవి ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ ద్వారా జరిగినట్టు సూచనలు కనిపిస్తున్నాయి. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దీనిని ఒక పెద్ద కుట్రగా అభివర్ణించారు. కాంగ్రెస్‌కు బలమైన ప్రాంతాలలోనే ఈ తొలగింపులు ఎక్కువగా జరిగాయని ఆరోపించారు. అందుకు రాహుల్ గాంధీ చూపించిన సాక్షాలు రుజువు చేస్తున్నాయి. ఇది రాజకీయ ప్రయోజనాలకోసం ఉద్దేశపూర్వకంగా ఓటర్ల జాబితాను మార్చడానికి చేసిన ప్రయత్నమని స్పష్టమవుతుంది. మరోవైపు, రాజురా నియోజకవర్గంలో బోగస్ ఓట్ల చేర్పులు లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ లీడ్ ఉన్నప్పటికీ, అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయానికి దారితీసినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. బిబిసి మరాఠీ ఇన్వెస్టిగేషన్ ప్రకారం, 2024 అక్టోబర్‌లో ఫిర్యాదు నమోదైనా 11 నెలల తర్వాత కూడా పోలీసులు ఎటువంటి చర్య తీసుకోలేదు. - ప్రజా సేవకుడు... పార్టీ విధేయుడు అలాగే ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులను సంప్రదించలేదు. ఎందుకు? ఇది స్పష్టంగా వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపుతుంది. కానీ కర్నాటక సిఐడి 18 సార్లు ఐపి అడ్రస్, డెస్టినేషన్ పోర్టులు, ఒటిపి టయిల్స్ వంటి డేటాను అభ్యర్థించినా ఇవ్వలేదు. ఈ ఆరోపణల విషయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రతిస్పందన మరింత వివాదాస్పదంగా ఉంది. ఎలాంటి విచారణ చేయకుండానే మొదటి నుండి ఈ ఆరోపణలను నిరాధారమైనవి అని కొట్టిపారేయడం ఏదో ఒక పార్టీని సమర్థించే నేతగా అతని ప్రతిస్పందన ఉందే కానీ నిష్పాక్షికంగా ఉన్నట్లు కనిపించటం లేదు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఈ డేటా లేకుండా, అక్రమాల వెనుక ఉన్న పెద్ద తలకాయలను కనుగొనడం అసాధ్యం. అందుకే రాహుల్ గాంధీ భారత ఎన్నికల సంఘం ఓట్ చోర్లను కాపాడుతున్నది అని స్పష్టంగా, బహిరంగంగా మీడియా ముందు ఆరోపించారు. ఆయన ఆరోపణ సమంజసమే అనిపిస్తుంది.

# భోజనం ఎక్కువ...తాకత్ తక్కువ

- తెలంగాణలో బ్యాలెన్స్‌డ్ ఫుడ్ లోపం

-అధికంగా నూనెలు, ఉప్పు ఉపయోగమే రోగాలకు కారణం





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆహారపు అలవాట్లు క్రమంగా అసమతుల్య దిశలో పయనిస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బియ్యం ఆధారిత ఆహారం ఎ క్కువగా తీసుకోవడం వలన శరీరానికి తగినంత పోషకాలు అందక, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తాజా అధ్యాయనా లు వెల్లడించాయి.తినే తిండిలో 67% అన్నమే..మొత్తం ఆహారంలో 70% కార్బోహైడ్రేట్లే,కూరలు, పండ్లు తక్కువగా తింటున్నారు.ప్రోటీన్లు, మినరల్స్, విటమిన్లు అందక రోగాలు పెరిగిపోతున్నాయనికార్బోహైడ్రేట్స్, కొవ్వు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. అధికంగా నూనెలు ఉప్పు వాడడంతో త్వరగా రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి.

**ఐసీఎంఆర్ స్టడీలో వెల్లడి..**

ఆరోగ్యం బాగుండాలంటే, మనం తినే తిండి బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలని డాక్టర్లు చెప్తుంటారు. అన్నంతో పాటు ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ తగిన మోతాదులో తీసుకోవాలని సూచిస్తుంటారు. కానీ మన తెలంగాణలో మాత్రం ప్రజలు బ్యాలెన్స్‌డ్ డైట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) స్టడీలో తేలింది.

మన పూర్వీకులు చెప్పిన బలం ఇచ్చే తిండిని వదిలిపెట్టి, పిండి పదార్థాలు తప్ప మరేమీ లేని ఉత్త అన్నాన్ని, ఇడ్లీ, దోస, మిర్చి బజ్జి, మైసూర్ బోండాలు తెలంగాణ వాళ్లు ఎక్కువ తినేస్తున్నారని వెల్లడైంది. తెలంగాణ ప్రజలు తినే తిండిలో 67 శాతం అన్నమే ఉంటున్నదని ఈ అధ్యయనం తేల్చింది. ఈ స్టడీ కోసం ఐసీఎంఆర్ దేశవ్యాప్తంగా 1.24 లక్షల మంది నుంచి వివరాలను సేకరించింది. నేషనల్ గైడ్‌లైన్స్ ప్రకారం రోజూ 2 వేల క్యాలరీల ఫుడ్ తీసుకోవాల్సి ఉంటుంది. అందులో కేవలం 50 శాతం లోపు మాత్రమే కార్బోహైడ్రేట్స్ ఉండాలి. కానీ, మన రాష్ట్రంలో మాత్రం మొత్తం ఫుడ్‌లో 70 శాతం మేర కార్బోహైడ్రేట్స్ ఉంటున్నాయని తమ స్టడీలో తేలినట్టు ఐసీఎంఆర్ వెల్లడించింది.

**ప్రోటీన్లు, విటమిన్లు తక్కువే..**

రాష్ట్రంలో కొవ్వు పదార్థాలు నూనెలు చాలా ఎక్కువే తింటున్నట్టు స్టడీలో తేలింది. నేషనల్ గైడ్‌లైన్స్ ప్రకారం 10 శాతం కన్నా తక్కువగా కొవ్వు పదార్థాలు తీసుకోవాల్సి ఉన్నా అంతకు మించి 25 శాతం కొవ్వు పదార్థాలు అధికంగా తింటున్నారని అధ్యయనం స్పష్టం చేసింది. అదే సమయంలో ప్రోటీన్లు, విటమిన్లు మాత్రం చాలా తక్కువగా తీసుకుంటున్నారని ఐసీఎంఆర్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రోటీన్, విటమిన్ల ఫుడ్ కేవలం 10 శాతం వరకే ఉంటున్నదని తేల్చి చెప్పింది. పండ్లు చాలా తక్కువగా తింటున్నారని పేర్కొంది. జొన్న రొట్టె, గోధుమ రొట్టె వంటివి తింటున్నా ఆశించిన స్థాయిలో లేదని వెల్లడించింది. ప్రోటీన్ కోసం
ఎక్కువగా చికెన్ పైనే ఆధారపడుతున్నారని, పప్పు తక్కువగా తింటున్నారని పేర్కొంది. ఇటీవల పాలు, పెరుగు వాడకం అధికంగా పెరిగిందని వెల్లడించింది.

ఈశన్య రాష్ట్రాల్లోనే అన్నం ఎక్కువ..

దేశంలో అన్నం ఎక్కువ తింటున్న రాష్ట్రాల జాబితాలో ఈశాన్య రాష్ట్రాలే టాప్‌లో ఉన్నాయని స్టడీ తేల్చింది. ఆయా రాష్ట్రాల్లో 99 శాతం అన్నమే తింటున్నారని, ఈ డైట్ బ్యాలెన్స్ మరీ దారుణంగా ఉందని పేర్కొంది. అదే సమయంలో మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గోధుమలు, సజ్జలు, జొన్న పిండితో చేసిన రొట్టెలను ఎక్కువగా తింటున్నారని, వాళ్ల డైట్‌లో అదే 80 శాతం వరకు ఉంటున్నదని స్టడీ తేల్చింది.

**చర్యలు తీసుకోవాల్సిందే..**

కేంద్రంతో సహా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీఎంఆర్ సూచించింది. బ్యాలెన్స్‌డ్ డైట్ ఉండేలా ప్రణాళికలను ప్రభుత్వాలు రచించాల్సిన అవసరం చాలా ఉందని స్పష్టం చేసింది. న్యూట్రిషన్ ప్లాన్‌పై ప్రజలకు పెద్ద మొత్తంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పింది.

**నిపుణుల సూచన:**

బియ్యం పరిమితంగా తీసుకోవాలి

పప్పు లు, ఆకుకూరలు పండ్లు ప్రతిరోజూ తినాలి

మీలేట్లు (రాగి, జొన్న, సజ్జ,)ఆహారంలో చేర్చాలి

తక్కువనూనె, తక్కువ ఉప్పు వాడకం పాటించాలి

పిల్లల ఆహారంలో పాల ఉత్పత్తులు తప్పనిసరిగా ఉండాలి

ఫుడ్‌లో బ్యాలెన్స్ లేకపోవడం వల్ల దేశంలో షుగర్, గుండె జబ్బులు పెరుగుతున్నాయని ఐసీఎంఆర్ ఆందోళన వ్యక్తం చేసింది. దేశ జనాభాలో ఇప్పటికే 12 శాతం మంది షుగర్ బారిన పడ్డారని, మరో 15.4 శాతం మంది ప్రీ డయాబెటిస్ స్టేజ్‌లో ఉన్నారని పేర్కొంది. 28.6 శాతం మంది ఊబకాయంతో ఉన్నారని, 40 శాతం మంది కుండ పొట్టతో లావెక్కారని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో సంభవిస్తున్న మరణాల్లో 68 శాతం (63 లక్షలు) గుండె, షుగర్ సంబంధిత జబ్బుల వల్లేనని పేర్కొంది. ఈ జబ్బుల భారం దేశ జీడీపీలో 2.5 శాతం అని పేర్కొంది.

2060 నాటికి దాదాపు వీటి మీదే రూ.75 లక్షల కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అంచనా వేసింది. మరోవైపు దేశంలో 15 శాతం మంది సిగరెట్, బీడీ వంటివి తాగుతుంటే. ఇది ఊర్లలోనే ఎక్కువగా ఉందని ఐసీఎంఆర్ పేర్కొంది. ఊర్లలో 16 శాతం మంది ధూమపానం చేస్తుంటే, సిటీల్లో 14 శాతం మంది చేస్తున్నట్టు తెలిపింది. ఇక దేశంలో 15 శాతం మంది మందు తాగుతున్నట్టు తెలిపింది.తెలంగాణాలో భోజనం ఎక్కువగా తింటే శక్తి పెరుగుతుందని “అనేఅభిప్రాయం తప్పు అని వైద్య నిపుణులు చెపుతున్నారు. బియ్యం శరీరానికి తాత్కాలికంగా శక్తినిస్తుందేమో కానీ దీర్ఘకాల ఆరోగ్యానికి మాత్రం బాలన్స్ డ్ డైట్ తప్పనిసరి
ప్రజల ఆహారంలో మార్పులు తెచ్చుకుంటేనే తెలంగాణ నిజమైన ఆరోగ్య రాష్ట్రంగా మారాగాలదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# బీహార్‌లో కులం కార్డే కీలక పాత్ర



బీహార్ ఓటర్ల జాబితా వివాదం మధ్య, కొన్ని రోజుల్లోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలను మెరుగుపరుచుకుంటున్నాయి. కానీ యథాప్రకారం అభ్యర్థుల ఎంపికలో కులం కార్డే కేంద్ర బిందువు అవుతుంది. ఏదైనా ఎన్నికల్లో రెండు విధాలుగా ఓటర్లను ప్రలోభపరచవలసి ఉంటుంది. ఐదేళ్ల క్రితం లాలూప్రసాద్ అప్పటి ఎన్నికలను అగ్డా (అగ్ర వర్గాలు), పిచ్చడా (వెనుకబడిన వర్గాలు) మధ్య పోరాటంగా అభివర్ణించారు. బిజెపిని సంప్రదాయ అగ్రకులాల, ఉన్నత వర్గాల పార్టీగా ప్రకటించారు. 2024లో ‘ఇండియా కూటమి’ కూడా రెండు విధాలుగా ప్రచారాన్ని ముందుకు సాగించాలని ఆకాంక్షించింది. వెనుకబడిన వర్గాలపైనే దృష్టిపెట్టి మరింత సంరక్షణ వారికి అవసరమని ప్రచారం సాగించింది. మరిన్ని కనుగొనండి ఈ-పేపర్ చందా వ్యాపార వార్తలు రాజకీయ విశ్లేషణ పుస్తకాలు బ్రేకింగ్ న్యూస్ తాజా వార్తలు క్రైమ్ థ్రిల్లర్ పుస్తకాలు జ్యోతిష్య సేవలు తెలంగాణ న్యూస్ స్థానిక వార్తలు ఇ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ బీహార్‌లో వెనుకబడిన వర్గాల సమీకరణకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వలస కాలంనుంచే ఈ తరహా ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవి రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టాయి. ఈ వెనుకబడిన వర్గాల సమీకరణే ఎన్నికల పోటీకి సాధనంగా ఉపయోగపడుతుంది. ఉన్నతవర్గాలు, తక్కువస్థాయి వర్గాలు అన్న తేడాయే విచక్షణకు దారితీస్తుంది. ఏదెలాగున్నా పొత్తులు, ప్రతిపొత్తుల ఆట, మొత్తంమీద పార్టీ వ్యవస్థలో రాజకీయ చీలికలు ఈ రెండు కోణాల దృష్టిని నిత్యం క్లిష్టం చేస్తున్నాయి. చారిత్రకంగా చూస్తే బిజెపి అభ్యర్థుల ఎంపిక ఉన్నత కులాల అనుకూలంగానే ఉంటుంది. 2020 లో బిజెపి 74 మంది ఎంఎల్‌ఎల్లో 33 మంది (40%) ఉన్నత కులాల వారే. అలాగే ఎక్కడా బిజెపి ముస్లిం అభ్యర్థులను ఎంపిక చేయదు. అంటే దీని అర్థం మిగతా అభ్యర్థులు ఒబిసి(26), ఇబిసి(2) నుంచి ఎంపిక చేసిన వారే. దీనికి విరుద్ధంగా జెడియు 43 మంది ఎంఎల్‌ఎల్లో 22 మంది ఒబిసి, ఇబిసిలకు చెందినప్పటికీ కేవలం 10 మంది మాత్రమే ఉన్నత కులాల వారు ఉన్నారు. - ప్రజా సేవకుడు... పార్టీ విధేయుడు చాలామంది జెడియు ఎంఎల్‌ఎల్లో ఏడుగురు కుర్మీలు, నలుగురు యాదవులతో కలుపుకుని స్థానిక ప్రాధాన్యం కలిగిన ఒబిసి గ్రూపులకు చెందినవారే. మరోవైపు ఆర్‌జెడి నిర్మొహమాటంగా పూర్తిగా యాదవులకే అనుకూలంగా ఉంటుంది. 2020లో ఆర్‌జెడి అవకాశం ఉన్నంత వరకు సీట్ల సర్దుబాటు ఒప్పందాన్ని సద్వినియోగం చేసుకుంది. 44 సీట్లలో 26ను గెలుచుకుంది. బిజెపి, జెడియుకు భిన్నంగా ఆర్‌జెడి ముస్లిం అభ్యర్థులను నియమించింది. కాంగ్రెస్ కూడా అలాగే చేసింది. వాస్తవానికి ప్రధాన పార్టీలన్నిటిలో కాంగ్రెస్ లోనే ముస్లిం ఎంఎల్‌ఎల జనాభా ఎక్కువ. కానీ అది కూడా బీహార్‌లో అతిచిన్న నాలుగు పార్టీల్లో ఒకటిగా మిగిలిపోతుంది. 2000 సంవత్సరం మొదట్లో లాలూ తగ్గిపోవడంతో కుర్మీలు/కుష్వాహాలు, మరికొంతమంది ఇబిసిలతోపాటు యాదవేతర ఒబిసిల ప్రాతినిధ్యానికి చోటు లభించింది. - జనాలను కూడగట్టి..వారి ప్రాణాలనే పణంపెట్టి!  మరిన్ని కనుగొనండి క్రైమ్ థ్రిల్లర్ పుస్తకాలు ఆంధ్రప్రదేశ్ వార్తలు వ్యాపార వార్తలు వార్తల సబ్‌స్క్రిప్షన్ ఆధ్యాత్మిక పుస్తకాలు బ్రేకింగ్ న్యూస్ క్రికెట్ మ్యాచ్ టిక్కెట్లు వ్యాపార సలహా సేవలు ఆధ్యాత్మిక కంటెంట్ ఇ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ 2020లో తొమ్మిది వేర్వేరు గ్రూపులనుంచి వైవిధ్యంగా 28మంది ఒబిసి ఎంఎల్‌ఎలను ఎంచుకుంది. వీరిలో చాలావరకు బనియాలు, యాదవులు కూడా ఉన్నారు. బిజెపి, జెడియు లేదా ఆర్‌జెడి ఏదైనా ఎన్నికైన ఒబిసి ఎంఎల్‌ఎల్లో మెజార్టీ స్థానిక ప్రాధాన్యం కలిగిన సామాజిక వర్గాలవారే ఎంపికయ్యారు. ఇబిసిలు ప్రచార వాక్చాతుర్యానికి కేంద్రబిందువే అయినప్పటికీ, చాలావరకు మినహాయింపబడ్డారు. బీహార్ జనాభాలో ఇబిసిలు దాదాపు 36 శాతం నుంచి 40 శాతం ఉన్నప్పటికీ, 2020 అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం కేవలం 11 శాతానికి పరిమితమైంది. చాలా పార్టీలు తమ టికెట్ల పంపిణీలో వైవిధ్యం చూపించినప్పటికీ ఫలితాలలో పెద్ద చీలిక కనిపించింది. తీవ్రమైన కుల విభజనే కీలకమవుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 22 శాతం ఓట్లతో ఆర్‌జెడి అతిపెద్ద పార్టీగా తెరపైకి వచ్చింది. 2014 నుంచి హిందీ బెల్టులో బిజెపి ఆధిపత్యం వహిస్తున్నా ఓట్లలో అయిదోవంతు మాత్రమే పొందగలిగింది. %ూశ్రీంశీ =ఘు౦% - నాగపూర్‌ను ముంచెత్తిన బౌద్ధ సంద్రం అభ్యర్థుల ఎంపికలో వైవిధ్యం చూపించాలని బిజెపి కాంక్షిస్తున్నా, అధికారంలో ఉండడానికి మిత్రవర్గాల పొత్తుపైనే ఆధారపడవలసి వస్తోంది. ముఖ్యంగా దాని ప్రధాన మిత్రపక్షం జెడియు తన జాతి మతపరమైన జాతీయవాద భాగాన్ని పంచకుండా ఇప్పటికీ సెక్యులర్‌శక్తిగా తన అస్తిత్వాన్ని ప్రదర్శిస్తోంది. కులాల చీలిక, వెనుకబడిన వర్గాల సుదీర్ఘ చారిత్రక ప్రభావం బిజెపి హిందుత్వవాదాన్ని అడ్డుకుంటున్నాయి. సామాజిక, ఎన్నికల పొత్తుల నిర్మాణానికే మొగ్గుచూపుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ వంటి చరిష్మా కలిగిన హిందుత్వరాజకీయ నేత లేకపోవడం కూడా బిజెపికి మైనస్ పాయింటే. మతపరమైన కేంద్రీకరణ బీహార్‌లో చాలా తక్కువ ప్రభావం చూపుతుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల ముఖ చిత్రాన్ని పరిశీలిస్తే బీహార్ రాజకీయ వ్యాకరణ మౌలిక స్వరూపం మారే అవకాశం లేదు. 2023లో నితీశ్‌కుమార్ నిర్వహించిన కులాల గణన బట్టి బీహార్ రాజకీయాల్లో కులమే ప్రధాన బలమైన పునాదిగా వెల్లడవుతోంది. అయితే ఈసారి రెండు కోణాలనుంచి అత్యంత ముఖ్యమైన అనిశ్చితి పరిస్థితులు కనిపిస్తున్నాయి.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
గురువారం 09 అక్టోబర్2025

# బాలయ్య సరసన సీమ పిల్ల సెకెండ్ లీడ్!



అనంతపురం బ్యూటీ ప్రియాంక జవాల్కర్ సుపరిచితమే. 'టాక్సీవాలా'తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు తొలి సినిమాతో సక్సెస్ ఖాతాలో వేసుకుంది. సీమ పిల్ల బ్యూటీకి కుర్రకారు ఫిదా అయ్యారు. సిగ్గులొలికే నవ్వు..హాట్ హాట్ ఫోజులో కుర్రాళ్లను అట్రాక్ట్ చేసింది. అటుపై 'తిమ్మరసు'..'ఎస్. ఆర్ కళ్యాణ మండపం'..'గమనం' లాంటి చిత్రాల్లో నటించింది. 'కళ్యాణ మండపం' బాగానే ఆడింది. కానీ ప్రియాంక అంత బిజీ స్టార్ కాలేకపోయింది. గతేడాది ఒక్క సినిమా కూడా చేయలేదు. 'గమనం' తర్వాత బ్యూటీ జాడే లేదు. సోషల్ మీడియాలో కూడా పెద్దగా యాక్టివ్ గా కనిపించలేదు. దీంతో సీమ పిల్ల ఏమైపోయిందంటూ ఓ సెక్షన్ ఆడియన్స్ లో చర్చకొచ్చింది. ఇలా డిస్కషన్ కి వచ్చిందో ? లేదా? అలా బాలయ్య 108వ సినిమాలో ఛాన్స్ అందుకుంది.

బాలయ్య కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఇంకా బాలయ్యకి హీరోయిన్ ని ఎంపిక చేయలేదు. కొంత మంది భామల పరిశీలన అనంతరం కాజల్ అగర్వాల్ ని తీసుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే ప్రియాంకకు ఇదే సినిమాలో బాలయ్య సరసన అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో అమ్మడు సెకెండ్ లీడ్ పోషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే సీమ పిల్లకి బాలయ్య ఊపిరిపోసినట్లే. ఇప్పటికే అవకాశాలు లేక ఖాళీగా ఉంటుంది. టైర్ -2 హీరోలెవరు ఆమెవైపు చూడటం లేదు. యంగ్ హీరోలు కూడా కొత్త భామలకే మొగ్గు చూపుతున్నారు తప్ప! చిన్నా ..చితకా సక్సెస్ లున్న వాళ్ల వైపు కనీసం లుక్ కూడా వేదయం లేదు.

కానీ బాలయ్య మాత్రం మంచి మనసుతో సీప పిల్లకి అవకాశం కల్పిస్తున్నారు. అవకాశాలు లేని హీరోయిన్లని ప్రోత్సహించడంలో ముందుంటారు . అప్పట్లో సోనాల్ చౌహాన్..

అంజలి లాంటి వారిని అవకాశాలు లేని సమయంలో ఆదుకున్న సంగతి తెలిసిందే.

# ఆ ముగ్గురిలో భయంకరమైన రియలేజేషన్




ఆ ముగ్గురిలో భయంకరమైన రియలేజేషన్! సినిమా అంటే ఏదో ఊహాలోకం. అక్కడ కొచ్చి ఏదో సాధించాలనే తపన. పది మందిలో తానో స్పెషల్ అనిపించు కోవాలనే ఆరాంట. %దీఎ: రాతీఅఝిఅ్త్ర ఖశీత్ష్ట్రుఎ ఎ 6 రాష్ 2025 5:49 ూవీ రాష్ట్రుతీవ%: సినిమా అంటే ఏదో ఊహాలోకం. అక్కడ కొచ్చి ఏదో సాధించాలనే తపన. పది మందిలో తానో స్పెషల్ అనిపించు కోవాలనే ఆరాంట. అందుకోసం ఏళ్ల తరబడి శ్రమ. ఈ క్రమంలో ఏదో ఒక తెలియని శక్తి ముందుకు నడిపిస్తుంది. ఎన్నో కష్టనష్టాలు ఓర్చి చివరికి సక్సెస్ అవుతారు. అటుపై పేరు..డబ్బు..పరపతి అన్ని వస్తాయి. ఆ తర్వాత కొంత కాలానికి కొందరిలో వచ్చే రియలైజేషన్ చూస్తే? జీవితం అంటే ఇంతేనా? అనిపించక మానదు. అలాంటి వాళ్లలో ప్రముఖుడు ఎవరు? అంటే ముందుగా పూరి జగన్నాథ్ పేరు చెప్పాలి. పూరి ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వెళ్లి పెద్ద డైరెక్టర్ అయ్యాడు. %ూశ్రీంశీ =ఝుఎ% - 5 సినిమాలు.. ఇదే కదా టాలీవుడ్ కు కావాల్సింది.. ఇష్టమైన పనిలోనే సంతోషం: గొప్ప గొప్ప నటుల్ని డైరెక్ట్ చేసాడు. కోట్లు సంపాదించాడు. లగ్జరీ లైఫ్ ని ఆస్వాదించాడు. ఇప్పుడు పూరి చెప్పే మాట ఏంటో ? తెలుసా? సంతోషంగా ఉండటం అంటే కోట్లు సంపాదించడం కాదు. పేరు సంపాదించడం అంతకన్నా కాదు. సమాజంలో గౌరవ మర్యాదలు అసలే కాదు. ఇష్టపడిన పనని సంతోషంగా చేయడంలో అసలైన సంతోషం ఉంటుదన్నాడు ఓ రోజు. అది వదిలేసి తెలియని దాని కోసం పరుగులు పెట్టి జీవితాన్ని గందరగోళం చేసుకుంటున్నారని తన అనుభవ పూర్వకంగా చెప్పే ప్రయత్నం చేసారు. - భార్యతో మాట్లాడకుండా షట్టర్లు దించేసిన స్టార్ హీరో వాళ్లిద్దరిలాగే యంగ్ హీరో: సరిగ్గా ఇలాంటి హితబోధనే చేసారు గురూజీ త్రివిక్రమ్. మనిషి బ్రతికినంత కాలం నిజాయితీగా, నిబద్ధతతో , ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా జీవించడంలోనే అసలైన సంతోషం ఉంటుందన్నారు. దాన్ని వదిలేసి ఎక్కడికో ఏదో సాధించాలని పరుగలు తీడయం అన్నది అనవసరమైన చర్యగానే పేర్కొన్నారు. జీవితంలో ఏదైనా సహజంగా జరగాలి తప్ప పని గట్టుకుని అలాగే ఉండాలని వాస్తవానికి దూరంగా ఉండటం అన్నది జీవితమే కాదన్నారు. తాజాగా యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కూడా వాళ్లిద్దరి నోట్లో నుంచి ఊడి పడినట్లే మాట్లా డాడు.

# పూల డ్రెస్సులో పులకరించిపోతున్న అలియా..!




అతి కొద్ది మంది టాలెంటెడ్ బాలీవుడ్ నటీమణుల్లో అలియా భట్ ఒకరు. అందానికి అందం అభినయానికి అభినయం అలియా సొంతం. ఎలాంటి పాత్ర వచ్చినా అందులో జీవించేస్తుంది. ఆర్ఆర్ఆర్ సినిమాలో సీత పాత్ర చేసినప్పుడు ఈ విషయం మరోసారి నిరూపితమైంది. పెళ్లై తల్లి అయిన తర్వాత కూడా అలియా తన గ్లామర్ ను ఏమాత్రం కోల్పోలేదు. ప్రసవం తర్వాత తిరిగి సాధారణ స్థితికి వచ్చేసింది. అంటే ఫిట్ గా మారిపోయింది. ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ ఫోటో షూట్లు నిర్వహిస్తోంది. తాజాగా అలియా భట్ తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో కొన్ని పిక్స్ పోస్టు చేసింది.

ఫ్లోవర్ డిజైన్ తో ఉన్న వైట్ కలర్ ఔట్ ఫిట్ ధరించింది అలియా. ఎల్లే ఇండియా కోసం ఈ ఫోటో షూట్ లో పాల్గొంది ఈ బ్యూటీ. మరో పిక్ లో గోల్డ్ కలర్ స్పార్కిల్ ఔట్ ఫిట్ లో మెరిసిపోయింది. గోల్డ్ కలర్ ఇయర్ రింగ్స్ తో స్టైల్ చేసింది. మెస్సీ హెయిర్ స్టైల్ అదిరిపోయింది.తర్వాతి పిక్ లో అలియా భట్ పింక్ బ్యూటీలా మెరిసిపోయింది. మత్తెక్కించే చూపులతో మైమరిపించింది ఈ బాలీవుడ్ లవ్లీ భామ. ఈ మధ్యే ఓ బుజ్జాయికి జన్మనిచ్చింది ఈ బ్యూటీ. అందం ఎక్కడ పాడై పోతుందోనని చాలా మంది సెలబ్రిటీలు సరోగసీకి వెళ్తున్న ఈ కాలంలోనూ అలియా తన గర్భంలో బిడ్డను మోసి జన్మనివ్వడం ద్వారా చాలా మంది అభిమానాన్ని సంపాదించుకుంది.బ్యాగ్రౌండ్ వల్లే మొదటి సినిమా అవకాశం వచ్చినా ఆ తర్వాత తన పర్ఫార్మెన్స్ తో అందంతో ఎంతో ఎత్తుకు ఎదిగింది. వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంటూ తన టాలెంట్ ను నిరూపించుకుంది. హీరోయిన్ పాత్రలు లేడీ ఓరియెంటెడ్ పాత్రల్లో నటించి తన టాలెంట్ ఏంటో చాటి చెప్పింది. ప్రస్తుతం ఆలియా భట్ ఓ హాలీవుడ్ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ స్టార్ గాల్ గాడోట్ తో కలిసి హార్ట్ ఆఫ్ స్టోన్ షూటింగ్ చేస్తోంది. ఈ స్పై థ్రిల్లర్ లో గాల్ గాడోట్ జామీ డోర్నన్ లతో కలిసి ఆలియా కనిపించనుంది. ఈ సినిమాకు టామ్ హార్పర్



# కుటుంబ కలహాల్లో ఇరుక్కున్న 'మేజర్' బ్యూటీ

'దబాంగ్ 3' చిత్రంతో బాలీవుడ్ లో అరంగేట్రం చేసిన సాయి మంజ్రేకర్ ద్వితీయ ప్రయత్నం అడివి శేష్ సరసన మేజర్ లాంటి పాన్ ఇండియా చిత్రంలో నటించింది. అందానికి అందం ప్రతిభ ఉన్న యువనాయికగా తెరపైకి దూసుకొచ్చింది. ఈ బ్యూటీ తృతీయ ప్రయత్నంగా పలు భారీ సినిమాలకు సంతకాలు చేసింది. వీటిలో వరుణ్ తేజ్ సరసన నటించిన గని ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు.

ఈ చిత్రంలో ఉపేంద్ర - సునీల్ శెట్టి కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తదుపరి టాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని (రాపో) సరసన నటిస్తూ ఈ బ్యూటీ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఇక రామ్ సరసన నటిస్తున్న విషయాన్ని సయీ మంజ్రేకర్ స్వయంగా ధృవీకరించారు! ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో రామ్ పోతినేని సరసన నటించనున్నానని తెలిపింది.

కుటుంబ కలహాలలో చిక్కుకున్న సంపన్నురాలు బాగా చదువుకున్న అమ్మాయిగా సయీ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాలో మిర్చి లో అనుష్క పాత్రకు ఉన్నంత ప్రాధాన్యత ఉంటుందని అయితే సంపన్నురాలిగా సయీ ముఖర్జీ నటన మరో లెవల్లో ఉంటుందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే రామ్ -సయీముఖర్జీ జంట బోయపాటి కలర్ ఫుల్ ఫ్రేమ్స్ లో ఎంతో అందంగా ఒదిగిపోయారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

రామ్ సినిమాతో పాటు సయీ కెరీర్ పరంగా ఇతర ప్రాజెక్ట్ లతోను బిజీగా ఉంది. ప్రముఖ గాయకుడు గురు రంధవా హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'కుచ్ ఖట్టా హెు జే' లో కూడా కనిపించనుంది. ఈ చిత్రం అక్టోబర్ 2022లో ప్రారంభం కాగా ఇందులో అనుపమ్ ఖేర్ కూడా నటిస్తున్నారు. సయీ మంజ్రేకర్ కోసం ఇటు టాలీవుడ్ లో వరుసగా దర్శకనిర్మాతలు క్యూ కడుతున్నారన్న టాక్ కూడా ఉంది.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
గురువారం 09 అక్టోబర్2025

## వాహనాలను తనిఖీ చేసిన మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి సూచించారు. బుధవారం మేడ్చల్ పట్టణం కెఎల్ఆర్ వెంచర్ కాలనీ లో ఏసిపి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ లు చేశారు. స్థానికంగా నడుపుతున్న ఆటోలను తనిఖీ చేశారు. ఆటోల సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయా, లేవ అని తనిఖీ చేశారు. పెండింగ్ ఛాలన్లు ఉన్న వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఛాలన్లు కట్టించారు. ఈ సందర్భంగా ఏసిపి శంకర్ రెడ్డి మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిఐ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారి మాధవ రెడ్డికి సన్మానం



మేడ్చల్( ప్రశ్న న్యూస్)మేడ్చల్ మండల వ్యవసాయ అధికారిగా ఇటీవల నియామకమై బాధ్యతలు స్వీకరించిన సోమ మాధవరెడ్డి బుధవారం పూడూరు రైతు సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ నాలబాపని సుధాకర్ రెడ్డి,డైరెక్టర్లు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ నాలబాపని సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ పనిచేస్తుందని పేర్కొన్నారు. సొసైటీ పరిధిలో ఏ ఒక్క రైతుకు ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు మినహా రైతులందరికీ యూరియాను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, ఏఈవో తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సర్కార్‌ను బొందపెట్టడం ఖాయం : గొంగిడి మహేందర్ రెడ్డి



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) రెండున్నరేళ్ల రేవంత్‌రెడ్డి సర్కార్ పాలనపై విసుగుచెందిన ప్రజానీకం కేసీఆర్ వెంటే ఉంటామని బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నట్లు ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బొందపెట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తుర్కపల్లి మండలం దయ్యంబండ తండా గ్రామ పరిధిలోని మంచిరోని మామిళ్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, గౌడ సంఘం అధ్యక్షుడు తాటికొండ రాజుగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వకుడోత్ రవినాయక్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యాదిరెడ్డి, బాసిరెడ్డి తిరుపతిరెడ్డి, ఆదర్శ రెడ్డి, సతీశ్‌రెడ్డి, అంజిరెడ్డి, అజిత్ గౌడ్, నర్సయ్య గౌడ్, చంద్రయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి, సందీప్, సాయివర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బానుగౌడ్, దేవేందర్ గౌడ్, బబ్లూ నాయక్ తండాకు చెందిన బీజేపీ మాజీ సర్పంచ్ మాడొత్ రమేశ్ నాయక్ తో పాటు సుమారు 200 మంది కాంగ్రెస్, బీజేపీ కి రాజీనామా చేసి బుధవారం యాదగిరిగుట్టలో గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలన రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. రైతు భరోసా లేదు, రైతు బీమా లేదు, నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదని మండిపడ్డారు. 22 నెలల పాలనలో ఆయన చేసింది శూన్యమన్నారు. సకాలంలో యూరియా అందక ఎంతో మంది రైతులు నరకం అనుభవిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్టే ఇచ్చి వారికి బిల్లులు రాక ఇళ్లు కట్టలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. రైతుల పక్షపాతిగా పదేళ్ల కేసీఆర్ పాలన సాగిందని ప్రజలు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కారు గుర్తుకు ఓటేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సమకూర్చడంలో ఇక్కడి ఎమ్మెల్యే ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ఇంటింటికీ పంపిణీ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ సునామీ రాబోతుందని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టబోతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ తుర్కపల్లి మండల అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేంద్రరెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ ర్యాకల రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# అవసరమైతే పోస్టుమార్టం చేసి నిగ్గుతేల్చండి

-కల్తీ మద్యం తయారీదారులపై
ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబు ఆదేశం
-మద్యం మరణాలపై వైసీపీ
తప్పుడు ప్రచారం చేస్తోందని తీవ్ర ఆరోపణ
-అసత్య ప్రచారం చేసేవారిపై చట్టపరంగా



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు, ఇదే అంశాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని కూడా అంతే తీవ్రంగా అణిచివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులు, మంత్రులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన ఈ అంశంపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, అదే సమయంలో సహజ మరణాలను కూడా కల్తీ మద్యం మరణాలుగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

**అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు**

కొన్ని రాజకీయ పక్షాలు రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం ఏరులై పారుతోందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. "ప్రతి మూడు మద్యం బాటిళ్లలో ఒకటి కల్తీదేనని, కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఒక పథకం ప్రకారం ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. ఇది పూర్తిగా రాజకీయ కుట్ర" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆరోపణలు వచ్చిన ప్రతిచోటా సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. "మద్యం మరణం అని ప్రచారం చేసిన ప్రతి కేసులోనూ అవసరమైతే పోస్టుమార్టం నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలతో మరణానికి గల అసలు కారణాలను నిగ్గు తేల్చండి. వాస్తవాలను ప్రజల ముందు ఉంచండి" అని సూచించారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తేలితే, వారు మీడియా అయినా, సోషల్ మీడియా అయినా సరే, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వం సైలెంట్‌గా చూస్తూ ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు.

**కల్తీ మద్యంపై యుద్ధం**

గత 15 నెలల్లో పటిష్టమైన చర్యల ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను విజయవంతంగా అరికట్టామని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో పనిచేసి రాష్ట్రంలో కల్తీ మద్యం అనేదే లేకుండా చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో ఒక్క కల్తీ మద్యం తయారీ కేంద్రం కూడా ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు.

**వెలుగులోకి వచ్చిన ముఠాల దందా**

అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగు చూసిన కల్తీ మద్యం కేసులో ఇప్పటివరకు 21 మందిని నిందితులుగా గుర్తించామని, వారిలో 12 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్ధన్‌రావు కార్యకలాపాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతనిచ్చిన సమాచారంతో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని అతనికి చెందిన వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహించగా, కిరాణా షాపు వెనుక భారీగా కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు వివరించారు. సుమారు 15 ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న జనార్ధన్‌రావు, తన సోదరుడు జగన్ మోహన్ రావుతో కలిసి అధిక లాభాల కోసం ఈ కల్తీ దందాను నిర్వహిస్తున్నట్లు తేలిందన్నారు. ఇబ్రహీంపట్నం కేసులో 12 మంది నిందితులను గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేశామని, నలుగురిని పీటీ వారెంట్‌పై విచారిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.

**వైసీపీపై సీఎం రాజకీయ విమర్శలు**

ఈ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారా లోకేశ్ ప్రత్యక్షంగా పాల్గొనగా, హోంమంత్రితో సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రతిపక్ష వైసీపీకి ఎలాంటి అంశాలు దొరకడం లేదన్నారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నాం. దీంతో విమర్శలకు తావులేక, తమ పాత సిద్ధాంతమైన ఫేక్ ప్రచారాన్ని నమ్ముకున్నారు. 2019లో వివేకా హత్య సమయంలో వారు ఆడిన శవ రాజకీయాలను మర్చిపోవద్దు. వారి కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన బాధ్యత మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఉంది" అని ఆయన దిశానిర్దేశం చేశారు. వాస్తవాలను ప్రజలకు వివరించి, వారిలో ధైర్యం నింపాలని సూచించారు.

# యాదగిరిగుట్ట మెట్ల మార్గంను పరిశీలించిన ఈవో రవి





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట కార్యనిర్వాహణాధికారి గుగులోతు రవి కొండపైన మెట్ల మార్గము లైటింగ్ ఏర్పాట్లు, పారిశుధ్రత నిర్వహణ, జలప్రసాదము ప్రసాద విక్రయవిభాగము మొదలగు విభాగములు దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులు, ఇంచార్జి డిప్యూటీ డిప్యూటీ ఈఓ, ఏఈఓ లతో కలిసి పరిశీలించారు. ప్రసాదముల టికెటింగ్ కు ఏర్పాటు చేయబడిన కియోస్క్ మిషన్ గత రెండు, మూడు రోజుల నుండి పని చేయక పోవుట వలన వెంటనే టెక్నీషియన్స్ పిలిపించి సాంకేతిక సమస్యలు తొలగించి భక్తులకు అందుబాటులో తీసుకువచ్చారు. వాటి పనితీరును నిశితముగా పరిశీలించి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించియున్నారు. మెట్ల మార్గములో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలుగకుండా త్వరిత గతిన పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాట్లు గావింపవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించియున్నారు. భక్తులకు త్రాగునీటి కొరకు ఏర్పాటు చేయబడిన జలప్రసాదములను పరిశీలించి నాణ్యత ప్రమాణములతో కూడిన స్వచ్ఛమైన త్రాగునీటిని భక్తులకు నిరంతరము సరఫరా చేయవలయునని, ముఖ్యముగా భక్తులు సేదతీరే ప్రదేశములో అధిక ప్రాధాన్యతగా జలప్రసాదములను ఏర్పాటు చేయవలయునని ఇంజనీర్ అధికారులను ఆదేశించారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు మరిచిన అధికారులు

-నోటీసులు జారీ చేసి కూడా కూల్చివేతలకు నో అంటున్న వైనం
-లంచాలతో అడ్డగోలుగా కోట్లు గడిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
-అక్రమ నిర్మాణాలతో గ్రేటర్ హైదరాబాద్
నింపేస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీలు
-ఇన్ని అవినీతి అక్రమాలు చేయిస్తున్న అధికారులపై
చర్యలు తీసుకోవడంలో జంకుతున్న రేవంత్ సర్కార్
-అవినీతి చేస్తున్న అధికారులపై చర్యలు
తీసుకోకుంటే ప్రభుత్వంతో ప్రజలకే తీవ్ర నష్టం






ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
కాప్రా సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు
- జిహెచ్ఎంసి నిబంధనలకు పాతర
- పాత ఇళ్లపైనే కొత్త అంతస్తులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఫిర్యాదులు బుట్టదాక లేనా.?

నాచారం (ప్రశ్న న్యూస్) ఒక్క ప్రభుత్వాధికారి అవినీతికి పాల్పడుతున్నాడు, అక్రమాలను ప్రోత్సహిస్తున్నాడు అంటే వెంటనే ఉన్నత అధికారులు, సంబంధిత శాఖ మంత్రులు లేదా చివరికి ముఖ్యమంత్రి అయిన చర్యలు తీసుకోవాలి కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరు స్పందించి అవినీతి చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఇక అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా ప్రభుత్వ అధికారులు మారుతున్నారు. ఇందుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో అవినీతి రాజ్యమేలుతుంది, ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అందిన కాడికి దండుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన మాకేం సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు తమ విధులను నిర్వహించకుండా వాటిని లంచాలకు అమ్ముకుంటున్న ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాచారం డివిజన్ పరిధిలో కౌండిన్య నగర్ నందు 5 అంతస్తుల అక్రమ నిర్మాణం జరుగుతుందని దాని పక్కనే పాత భవనంపై అదనంగా రెండు అంతస్తులు పెంట్ హౌస్ వేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేసి కూల్చివేతలు చేయకుండా మౌనం వహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రాజకీయ నాయకుల పేరు చెబుతూ భారీగా లంచాలు వసూలు చేస్తున్నారని ఒకవేళ లంచాలు తీసుకోకుంటే ఈ అక్రమ నిర్మాణాలను కూల్చేవారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయని జోనల్ కమిషనర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ఇక అక్రమ నిర్మాణదారులకు టౌన్ ప్లానింగ్ అధికారులు అండగా ఉండి అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే వీటి వెనకాల కార్పొరేటర్ ఉన్నాడంటూ బుకాయింపులకు దిగుతున్నారు. మరి ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలు తీర్చడానికి ఉన్నారా.? లేదా అక్రమ నిర్మాణాలను చేయించి ప్రభుత్వానికి నష్టం చేయడానికి ఉన్నారా.? అన్నదానిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ స్పందించి కూల్చివేతలు చేయాలని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక

గురువారం 09 అక్టోబర్2025

## కోర్టు కేసులు తేలక ముందే నామినేషన్లు

### -తెలంగాణ స్థానిక ఎన్నికలు చెల్లుతాయా.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ నేడు జారీ కానుంది. ఉదయం పదిన్నర గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం హైకోర్టులో రిజర్వేషన్ల జీవోపై విచారణ కొనసాగుతుంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరవాత కోర్టులు జోక్యం చేసుకోవు. అందుకే ప్రక్రియ ఎన్నికల వరకూ జరుగుతుందని నమ్ముతున్నారు. కానీ న్యాయపరిశీలనలో రిజర్వేషన్ల జీవో నిలబడలేకపోతే మొదటికే మోసం వస్తుంది. ఎన్నికల ప్రక్రియ కూడా చెల్లకుండా పోతుంది. ఎందుకంటే ఆ రిజర్వేషన్ల జీవో ఆధారంగానే ఎన్నికల జీవో ఇచ్చారు. ఆ జీవో చెల్లనప్పుడు ఎన్నికల ప్రక్రియ కూడా చెల్లదు. అందుకే రాజకీయ పార్టీలు ఇప్పటికీ స్థానిక ఎన్నికల ప్రక్రియను నమ్మలేకపోతున్నాయి.

**◈ తొలి రోజే కాంగ్రెస్ నామినేషన్లు – ఇతర పార్టీల్లో లేని నమ్మకం**

నామినేషన్ల గడువు ప్రారంభమైన వెంటనే తమ పార్టీ నేతలతో నామినేషన్లు వేయించాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇది ఓ రకంగా రాజకీయంగా ఒత్తిడి పెంచే వ్యూహమే. రిజర్వేషన్ల జీవోపై స్టే ఇస్తే ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదని వాదించే ఓ ఆప్షన్ అధికార కాంగ్రెస్ పార్టీ వద్ద ఉంటుంది. కానీ కాంగ్రెస్ నేతలకూ ఈ ఎన్నికల చెల్లుబాటుపై సందేహాలు ఉన్నాయి. నామినేషన్లు వేసి ఖర్చులు పెట్టుకున్న తర్వాత అవి చెల్లకుండా పోతే నష్టపోతారు. ఇతర పార్టీలు ఈ ఎన్నికలను సీరియస్ గా తీసుకుంటున్న పరిస్థితులు కనిపించడం లేదు.

**◈ చట్టపరంగా కేసులు ఉంటే ముందుకెళ్లడం మంచిదేనా?**

రిజర్వేషన్ల జీవో ఇవ్వడానికి ప్రాతిపదిక అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు. ఆ బిల్లులను గవర్నర్ అధికారింగా ఆమోదించలేదు. అలాంటప్పుడు జీవో ఎలా ఇవ్వగలన్న ప్రశ్న వస్తోంది. గతంలో ఇలాంటి జీవోలు వచ్చినప్పుడు న్యాయపరిశీలనలో నిలబడలేదు. ఆ జీవో బేస్ గా చేసుకుని నిర్వహించిన ఎన్నికలు కూడా చెల్లలేదు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇదే విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. తొందరపడి డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దని, ఈ జీవో ఆధారంగా జరిగే ఎన్నికలు చెల్లవని ఆయన తేల్చేశారు. అయన స్వయంగా బీసీ వర్గానికి చెందిన నేత. బీసీ రిజర్వేషన్లకు ఆయన వ్యతిరేకమయ్యే అవకాశం లేదు. రాజకీయంగా ఉన్న అనివార్యతలపైనే ఆయన మాట్లాడారు. అయితే ఆయన బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శలకు గురయ్యారు.

**◈ రిజర్వేషన్ల హామీ నెరవేర్చడానికే తంటాలు.?**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడానికి చట్టపరంగా లేని అవకాశాలని కల్పించుకునే ప్రయత్నం చేస్తోంది. తాత్కలికంగా వారి ప్రయత్నాలు ముందుకు సాగవచ్చు కానీ అంతిమంగా ఔట్ పుట్ మాత్రం నిరాశ పరుస్తుందని గతంలో జరిగిన పరిణామాలు నిరూపిస్తున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి. సెంటిమెంట్ రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద రిస్క్ తీసుకుంటోందని అంటున్నారు. చట్టపరంగా జరగవని తేలినప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న వాదన ఉంది. అయితే తెలంగాణ ప్రభుత్వ పెద్దలు మాత్రం ఏటికి ఎదురీదే ప్రయత్నాలే చేస్తున్నారు.

# దక్షిణ కాశీ వేములవాడ

## - శివభక్తి వెలిగించే శైవ పుణ్యక్షేత్రం

- కోడెమొక్కు ఒక ఆచారం కాదు - బలమైన విశ్వాసం
- దివ్యాంగ భక్తుడి కోడె మొక్కు - అచంచల భక్తికి నిదర్శనం
- రాజన్న దర్శనం కోడె మొక్కుతోనే సంపూర్ణం
- కోడెమొక్కు వెనుక ఉన్న శివభక్తి తత్వం
- కోడెమొక్కు చెల్లింపుపై "ప్రజాప్రశ్న దినపత్రిక" ప్రత్యేక కథనం







**వేములవాడ (ప్రశ్న న్యూస్)**రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దివ్యాంగుడైన ఓ భక్తుడు తన వీల్ చైర్ లో కూర్చొని సైతం భక్తి శ్రద్ధలతో "కోడెమొక్కు"చెల్లిస్తున్న దృశ్యం ప్రజాప్రశ్న దినపత్రిక ప్రతినిధి కెమెరాకు చిక్కింది. దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కోడె మొక్కుల ప్రాధాన్యం, ఆచారం, భక్తి విశ్వాసం గురించి "ప్రజాప్రశ్న దినపత్రిక" ద్వారా ప్రత్యేక కథనం అందిస్తున్నాము.తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శతాబ్దాల నాటి చరిత్రను కలిగిఉన్న పవిత్రక్షేత్రం.భక్తులు ప్రేమతో "దక్షిణ కాశీ"గా పిలుచుకునే ఈ క్షేత్రం, శివభక్తి సమైక్యానికి ప్రతీక.శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు దర్శనార్థానికి విచ్చేస్తుంటారు.

**కోడె మొక్కులు %–% భక్తి ప్రతిజ్ఞాత్మక సంకేతం**

వేములవాడ రాజన్నాలయంలో ప్రత్యేకంగా కనిపించే పద్ధతుల్లో 'కోడె మొక్కు' అనేది ఒకటి. భక్తులు తమ మనసులో వున్న కోరికల్ని, కష్టాలను తీర్చమని స్వామిని వేడుకొని కోడె రూపంలో శివునికి అర్పిస్తారు.

**నిజ కోడె మొక్కు..**

భక్తులు ఏదైనా మనసులో ఉన్న కోరిక నెరవేరుతుందనే నమ్మకంలో భాగంగా ఒక కోడెను ప్రతిజ్ఞగా పెంచి ప్రతిపాలన పూర్తయిన తర్వాత స్వామివారి ఆలయానికి తీసుకువచ్చి ఆలయం చుట్టూ తిప్పి నిజకోడె రూపంలో సమర్పిస్తారు. ఈ నిజ కోడె మొక్కులు పూర్తి చేయడంతో కోరిక నెరవేరిందనే కృతజ్ఞతా చిహ్నంగా భావిస్తారు.

**ఆచారం వెనుక ఉన్న విశ్వాసం..**

స్థానిక పురాణ కథల ప్రకారం, వేములవాడలో శివయ్య కోడె స్వరూపాన్ని ఎంతో ఇష్టపడతాడని నమ్మకం ఉంది. "రాజరాజేశ్వరుడి దర్శనం కోడెతోనే సంపూర్ణమని" భక్తుల నమ్మకం. అందుకే అనేక మంది యాత్రికులు సుదూర ప్రాంతాలనుంచి వచ్చి కోడె మొక్కులు చెల్లించు కొంటారు.

తాము కట్టే కోడెను ఆలయ ప్రాంగణంలోని ప్రాచీన రథవీధిలో పరిగెత్తిస్తారు. ఆ కోడె మొక్కు భక్తి ఉత్సాహంతోంతో నిండిన దృశ్యం. చిన్నారుల నుంచి వృద్ధుల దాకా అందరూ ఈ సన్నివేశాన్ని ఆనందంగా తిలకిస్తారు.

**వైభవం – ఆధ్యాత్మికత కలబోత..**

శివరాత్రి, మహాశివరాత్రి, కార్తీక మాసం రోజుల్లో కోడె మొక్కులు విశేషంగా పెరుగుతాయి. ఆ సమయంలో వేములవాడ చుట్టుపక్కల ప్రాంతం కోడెల అరుపులతో (రంకెలతో) ఘంటానాదాలతో, మంత్రపఠనాలతో ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. ఆలయ మండపాల దారుల్లో భక్తుల జపాలు, శివనామస్మరణలు మార్మోగుతూ పూరితమవుతాయి.

**సామాజిక–ఆర్థిక కోణం..**

ఈ ఆచారం కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాదు, గ్రామీణ జీవవిధానంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. భక్తులు తెచ్చే కోడెలలో కొన్ని ఆలయం ఆధ్వర్యంలో పశువుల సంరక్షణకు, రైతులకు అందిస్తారు.

**భక్తిలో విశ్వాసం..**

వేములవాడలో కోడె మొక్కు కేవలం ఒక ఆచారమే కాదుఆది అంతమైన విశ్వాసానికి ప్రతిరూపం. వేదకాలం నాటి హవన కార్యాలు,యజ్ఞీయ విధులు నేటి ప్రజా భక్తిలో ఈ 'కోడె మొక్కు' రూపంలో అంతర్లీనమై ఉన్నాయి. భక్తులు శివుని కరుణతో తమ జీవితాలలో మార్పు సంభవిస్తుందనే అచంచల నమ్మకంతో ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రతి కోడె మొక్కు, ప్రతి నమస్కారం %–% భక్తి, సంప్రదాయం,విశ్వాసం లయబద్ధమైన ఆధ్యాత్మిక కథనం.



**ఆలయ ఈఓ రమాదేవి వివరణ..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి మాట్లాడుతూ ఆలయ ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న "కోడె మొక్కు చెల్లింపు" వేములవాడ ఆలయానికి ప్రత్యేకమైన ఆచారం. భక్తులు స్వామికి మనస్ఫూర్తిగా మొక్కుల ముడుపులలో భాగంగా కోడెను కట్టి తమ ప్రతిజ్ఞను నెరవేర్చుతారు. ఇది శతాబ్దాలుగా కొనసాగుతున్న భక్తి సంప్రదాయం. స్వామి దయతో ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఈ ఆచారంలో పాల్గొంటారు" అని తెలిపారు.

## సీజేఐ పై దాడికి యత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

### - భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్య వేదిక సభ్యుల డిమాండ్

### - అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా, సబ్ కలెక్టర్ కు వినతి





గూడూరు( ప్రశ్న న్యూస్)సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక సభ్యులు మాట్లాడుతూ

దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని అత్యున్నత న్యాయస్థానంలో రెండు రోజుల క్రితం సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్. గవాయ్ పై దాడికి యత్నించడాన్ని భారత లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఐక్య వేదిక తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికే ఈ దేశంలో భద్రత కరువైతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయమూర్తులు తీర్పునిస్తారన్నారు. అయితే మనువాది కిషోర్ న్యాయమూర్తి పై చెప్పు విసరడం సిగ్గుమాలిన చర్య అన్నారు. దీనిని తీవ్రమైన నేరంగా పరిగణించి సదరు న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతిపత్రం అందించారు. ఈ వినతిపత్రాన్ని భారతదేశ రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్ళవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక సమన్వయకర్త షేక్ జమాలుల్లా, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, సీపీఎం నాయకులు జోగి శివ కుమార్, ఎంబేటీ చంద్రయ్య, జీలానీ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఇంగిలాల భాస్కర్, పట్టణ కార్యదర్శి ఎండి. గౌస్ బాషా, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరమ్ జాతీయ ఉపాధ్యక్షులు వేగూరు విజయ్ కుమార్, మాల మహానాడు జిల్లా నాయకులు పల్లి కోటేశ్వరరావు రావ్, బీఎస్పీ, ఎంఆర్పీఎస్ నాయకులు మంద రవి, ఈశ్వరయ్య, కాంగ్రెస్, బీఎస్పీ, నాయకులు, మైనారిటీ నాయకులు, దూదేకుల సంఘం నాయకులు పర్వతాల శ్రీనివాసులు గౌడ్

# ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

- -చోద్యం చూస్తున్న అధికారులు
- -పక్కా నిర్మాణాలు చేపడుతున్న అక్రమార్కులు
- - వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- -పట్టించుకోని అధికారులు



**ఓజిలి (ప్రశ్న న్యూస్)**సందిట్లో సడేమియా అన్న చందంగా తయారైంది పరిస్థితి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారుల పనితీరు. ఓజిలి ఆర్టీసీ బస్టాండ్ మెయిన్‌రోడ్డుని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. పలువురు ఆర్అండ్‌బీకి చెందిన స్థలాల్లో నిర్మాణాలు నిర్మిస్తున్నారు. మెయిన్ రోడ్డు ఇరుకుగా వుండడం, దీనికితోడు వ్యాపారులు ఆక్రమిస్తుండడంతో సమస్య పెరిగిపోతున్నది. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు ఓజిలి బస్టాండ్ రోడ్డు ఇరువైపులా ఆర్ అండ్ బి రహదారి మార్జిన్లు దర్జాగా అక్రమ నిర్మాణ చేపట్టి ఆక్రమిస్తున్నారు. రహదారిని ఆక్రమించి రేకుల షెడ్ , భవనాలు నిర్మించిన పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు దౌర్జన్యంగా కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.సంబంధిత అధికారులు అధికారులుపట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆక్రమణలకు అడ్డుచెప్పేవారు లేరు. దీనితో రహదారి ఇరు వైపులా ఆక్రమణలతో కుచించుకుపోయింది. విశాలంగా రహదారులు ప్రస్తుతం ఇరుకు రోడ్లుగా మారిపోయాయి. భూముల విలువ అమాంతం పెరిగిపోవడంతతో ఎక్కడ ఖాళీ స్థలం కనపించినా పాగా వేసేస్తున్నారు. రోడ్లు ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునే అవకాశంలేకప్రమాదాలకుగురవుతున్నాయి.వాహనదారులు, ప్రయాణికులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. అండ్ బీ రోడ్డును ఆక్రమించి శాశ్వతంగా రేకుల ఇల్లు, భవనాలు నిర్మించారు. ఆర్ అండ్ బి రోడ్డు స్థలం ఆక్రమించి రేకులు షెడ్ నిర్మించినా పట్టించుకునే వారే కరువయ్యారు అధికారులు స్పందించి ఆర్ అండ్ బి రోడ్ల ఆక్రమణలను తొలగించి రోడ్లను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588